ఆరోపణలు ఉన్న అధికారులపై జీవీఎంసీ కమిషనర్ చర్యలు

- ఇద్దరు సరండర్, మరొకరిపై విచారణకు ఆదేశం

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అక్రమాలకు పాల్పడుతున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ విభాగాల్లో పనిచేస్తున్న ముగ్గురు అధికారులపై జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ చర్యలు తీసుకున్నారు. ఇంజనీరింగ్ విభాగంలో డీఈ స్థాయి అధికారిని సరండర్ చేసి, ఏఈ స్థాయి అధికారిపై విచారణకు ఆదేశించినట్టు ఒక ప్రకటన విడుదల చేశారు. అలాగే టౌన్‌ప్లానింగ్ విభాగంలో అవినీతి ఆరోపణలు నేపథ్యంలో ఒక టీపీఓను సరండర్ చేసినట్టు పేర్కొన్నారు.

శతాబ్ది ఉత్సవాల వేళ... అభివృద్ధి మేళా

రూ.270 కోట్లతో ఏయూ అధికారుల ప్రతిపాదనలు

- కేంద్రం రూ.170 కోట్లు, రాష్ట్రం రూ.100 కోట్లు...
- కొత్తగా సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్ భవనం నిర్మాణం



- 1,000 మంది విద్యార్థులకు సరిపడేలా రెండు వసతి గృహాలు
- సిబ్బంది కోసం నివాస గృహాలు
- ఇంకా సాంస్కృతిక వేదికలు, సమావేశ మందిరాలు, అతిథి గృహాల నిర్మాణానికి ప్రణాళికలు

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రస్తుతం శతాబ్ది వేడుకలు జరుపుకుంటోంది. ఇవి పూర్తయ్యే నాటికి రూ.270 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం నుంచి 'పూర్వోదయ' పథకం కింద సుమారు రూ.170 కోట్లు పొందేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపించారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం నుంచి మరో రూ.100 కోట్లు తీసుకోవాలని భావిస్తున్నారు. వేడుకలు పూర్తయ్యే నాటికి రూ.270 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో పాటు కొన్ని కీలక ప్రాజెక్టులను పూర్తిచేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధుల విడుదలకు గ్రీన్‌సిగ్నల్ వచ్చే అవకాశం ఉందని, ఈ మేరకు ఆయా అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన ప్రణాళికలను సిద్ధం చేసినట్టు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.రాంబాబు తెలిపారు.

కీలక ప్రాజెక్టులు ఇవే..

నార్త్, సౌత్ క్యాంపస్‌లలో 1,000 మంది విద్యార్థులకు సరిపడేలా రెండు వసతి గృహాలను నిర్మించనున్నారు. ఒక్కొక్కటి 500 మందికి వసతి కల్పించేలా నిర్మించాలని అధికారులు ప్రణాళికలు రూపొందించారు. అలాగే, కీలక విభాగాలకు చెందిన కొన్ని భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటి స్థానంలో నూతన భవనాలను నిర్మించాలని అధికారులు భావిస్తున్నారు. అదేవిధంగా సిబ్బందికి నివాస గృహాలను నిర్మించాలని నిర్ణయించారు. ప్రస్తుతం మద్దిలపాలెం, సిరిపురం, చినవాల్తేరు, పెదవాల్తేరు ప్రాంతాల్లో ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది నివాస గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటి స్థానంలో నూతన గృహాలను నిర్మించనున్నారు. సింగిల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లు 100, డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లు 50 నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. అలాగే, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని మరికొన్నిచోట్ల సాంస్కృతిక వేదికలు, సమావేశ మందిరాలు, అతిథి గృహాలను నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధంచేశారు. వీటితోపాటు కొత్తగా సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ నిర్మాణానికి సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఉన్న బ్లాక్ పురాతనమైనది. దీనిని కొనసాగిస్తూ సెంటినరీ సెలబ్రేషన్స్‌కు గుర్తుగా

... మిగతా 6వ పేజీలో



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్, అలూమ్ని చైర్మన్ కేవీవీ రావు తదితరులు

13న ఏయూ పూర్వ విద్యార్థుల సమావేశం

ఈ ఏడాది థీమ్ మహిళా సాధికారిత

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఇన్ఫోసిస్ ఫౌండేషన్, మూర్తి ట్రస్ట్ చైర్‌పర్సన్ సుధామూర్తి
- ఏయూ అలూమ్ని అసోసియేషన్ చైర్మన్ కేవీవీ రావు
- పూర్వ విద్యార్థులను వర్సిటీతో అనుసంధానం చేస్తాం
- వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశాన్ని 'వేవ్స్-2025 కార్యక్రమాన్ని ఈ నెల 13న నిర్వహిస్తున్నట్టు ఏయూ అలూమ్ని అసోసియేషన్ చైర్మన్ కేవీవీ రావు వెల్లడించారు. మంగళవారం ఉదయం అలూమ్ని జీఎంఆర్ సెమినార్ హాల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. మహిళా సాధికారిత థీమ్‌తో ఈ ఏడాది అలూమ్ని సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహిళా సాధికారతకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్న రాజ్యసభ ఎంపీ, రచయిత, ఇన్ఫోసిస్ ఫౌండేషన్, మూర్తి ట్రస్ట్ చైర్‌పర్సన్ సుధామూర్తి హాజరవుతున్నారన్నారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అలూమ్ని

... మిగతా 6వ పేజీలో

కొనసాగుతున్న విమానాల రద్దు

గత వారం రోజులుగా 'ఇండిగో' సర్వీస్‌లన్నీ రద్దు



- టూర్ క్యాన్సిల్ చేసుకుంటున్న బృందాలు
- పర్యాటక సీజన్‌కు పెద్ద దెబ్బ
- విశాఖపట్నం, అరకులోయల్లో హోటళ్లు, లాడ్జీలపై ప్రభావం ఎక్కువగా ఉందంటున్న ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.విజయమోహన్




(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విమాన సంస్థ 'ఇండిగో'లో ఏర్పడిన సంక్షోభం కొనసాగుతోంది. విశాఖపట్నం నుంచి బయలుదేరాల్సిన, ఇక్కడకు రావలసిన ఆ సంస్థ విమాన సర్వీసులన్నీ రద్దయిపోతున్నాయి. మంగళవారం కూడా ఎనిమిది ఇండిగో విమానాలు రద్దయ్యాయి. ఊహించని విధంగా విమానాలు రద్దు కావడం విశాఖపట్నంలో పర్యాటకం రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

ఇది పర్యాటక సీజన్. దేశంలోని అనేక ప్రాంతాల నుంచి ప్రకృతి ప్రేమికులు ఏజెన్సీ అందాలు చూడడానికి వస్తుంటారు. దీనికోసం ముందుగానే విమానాలు, రైళ్లలో టికెట్లు బుక్ చేసుకుంటారు. వారి కోసం ఇక్కడి ట్రావెల్ ఏజెన్సీలు హోటళ్లలో రూమ్‌లు కూడా ముందుగానే బుక్ చేసి పెడతాయి. వారం క్రితం ఇండిగో సంస్థలో ఏర్పడిన సంక్షోభం వల్ల సర్వీసులు నిలిచిపోయాయి. ఢిల్లీ, చెన్నై, కోల్‌కత్తా, ముంబై, భువనేశ్వర్, తిరుపతి వంటి ప్రాంతాల నుంచి విమాన టికెట్లు బుక్ చేసుకున్న పర్యాటకులు విశాఖపట్నం రాలేకపోతున్నారు. విదేశీ పర్యాటకులు కూడా ఢిల్లీ, చెన్నై, కోల్‌కత్తా, ముంబైల నుంచి కనెక్టింగ్ విమానాల్లో టిక్కెట్లు బుక్ చేసుకున్నారు. ఇండిగో సేవలపై ఆధారపడిన వారంతా పర్యటనలు రద్దు చేసుకోవలసి వచ్చింది. ఆ టికెట్లే కాకుండా ఇక్కడ హోటళ్లలో రూమ్‌లు కూడా క్యాన్సిల్ చేయాల్సి వస్తోంది. ఇంకెన్ని రోజులు ఈ సంక్షోభం ఉంటుందో తెలియదు గానీ మంచి పర్యాటక సీజన్‌పై గట్టి దెబ్బే కొట్టిందని ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.విజయమోహన్ ఆవేదన వ్యక్తంచేశారు. ముంబై, ఢిల్లీల నుంచి కనెక్టింగ్ విమానాల ద్వారా డిసెంబరు 10-15తేదీల మధ్య విశాఖపట్నం రావలసిన పలు బృందాలు ఇండిగో నిర్వాకం వల్ల ఆగిపోయాయని, దాని ద్వారా తాము నష్టపోయామన్నారు. విశాఖపట్నం, అరకులోయల్లోని హోటళ్లు, లాడ్జీలపై కూడా ఈ ప్రభావం ఎక్కువగా ఉందని పేర్కొన్నారు.

ప్రస్తుతం 21 విమానాలే రాకపోకలు

విశాఖపట్నం విమానాశ్రయం నుంచి ఇండిగో, స్పైస్‌జెట్, జెట్ ఎయిర్‌వేస్/జెట్ లైట్, ఎయిర్ ఇండియా, ఇండియన్ ఎయిర్‌లైన్స్ సంస్థలు హైదరాబాద్, ఢిల్లీ, చెన్నై కోల్‌కత్తా, ముంబై, భువనేశ్వర్, తిరుపతి, ఇండోర్, కోచి, పూణె, రాయపూర్, పోర్టు బ్లెయిర్ తదితర నగరాలకు డొమెస్టిక్ సర్వీసులు నడుపుతున్నాయి. నవంబరు నెలాఖరు వరకు విశాఖపట్నం విమానాశ్రయానికి రోజుకు 28 విమానాలు వచ్చి, తిరిగి వెళ్లేవి. అంటే 56 సర్వీసులు అందుబాటులో ఉండేవి. ఇందులో ఇండిగో సంస్థ హైదరాబాద్‌కు-2, చెన్నై, కోల్‌కత్తా, ముంబై, భువనేశ్వర్, ఢిల్లీ, తిరుపతిలకు ఒక్కో విమానం నడుపుతోంది. ప్రస్తుతం ఇండిగో విమానాలు రోజుకు ఎనిమిది రద్దయిపోతున్నాయి. దాంతో కేవలం 21 విమానాలే డిసెంబరు 2వ తేదీ నుంచి తిరిగి వెళుతున్నాయి. దీంతో ప్రయాణికుల సంఖ్య కూడా గణనీయంగా పడిపోయింది. ఈ సంక్షోభం ముగిసి ఇండిగో సేవలు ఎప్పటి నుంచి పునరుద్ధరణ జరుగుతాయో తెలియదని విమానాశ్రయ వర్గాలు పేర్కొన్నాయి.



12న సీఎం రాక

- కాగ్నిజెంట్ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన
- అదేరోజు రుషికొండ హిల్ 3పై తాత్కాలిక కార్యాలయం ప్రారంభం

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 12వ తేదీన జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. కాగ్నిజెంట్ సంస్థకు కాపులుప్పాడలో భూమి కేటాయించిన సంగతి తెలిసిందే. అందులో శుక్రవారం సీఎం చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేయనున్నారు. దాంతో పాటు విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ సమావేశం కూడా నిర్వహించనున్నారు. అదే విధంగా రుషికొండ ఐటీ పార్కులో కాగ్నిజెంట్ తాత్కాలిక కార్యాలయాన్ని కూడా ప్రారంభించనున్నారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌తో కలిసి కలెక్టర్ ఆయా ప్రాంతాలను సందర్శించి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. రుషికొండ ఐటీ పార్కులో హిల్ నంబరు 3పై సీఎం దిగే హెలిపాడ్‌ను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ అధికారులు, కాగ్నిజెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.



రుషికొండపై ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

14న నేవీ మారథాన్

- 17 దేశాల నుంచి ప్రతినిధులు

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నేవీ దినోత్సవంలో భాగంగా తూర్పు నౌకాదళం ఈ నెల 14న 'వైజాగ్ నేవీ మారథాన్' నిర్వహించనున్నదని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వెల్లడించారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, పదో ఎడిషన్‌గా నిర్వహిస్తున్న ఈ మారథాన్‌లో 1,750 మంది పాల్గొంటున్నారని, 17 దేశాల ప్రతినిధులు కూడా వస్తున్నారన్నారు. దీనికి అవసరమైన ఏర్పాట్లలో వేయి మంది సిబ్బంది, రెండు వేల మంది వలంటీర్లు సేవలు అందిస్తారాన్నరు. ఈ పోటీలు 42 కి.మీ., 21 కి.మీ., 10 కి.మీ., 5 కి.మీ. విభాగాల్లో జరుగుతాయన్నారు. మారథాన్ విశాఖలో ఆర్కే బీచ్ వద్ద ప్రారంభమై, తీరం వెంబడి భీమిలి వరకూ కొనసాగుతుందన్నారు. ప్రతి రన్నర్‌కు డ్రై-ఫిట్ టీ షర్ట్,



నేవీ మారథాన్ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

... మిగతా 6వ పేజీలో



ఔషధ ప్రయోగశాలలో ఏర్పాటు చేసిన పరికరాలు

విమ్స్‌లో ఔషధ నియంత్రణ విభాగం కార్యాలయం, ల్యాబ్

- వర్చువల్‌గా ప్రారంభించిన వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి వై.సత్యకుమార్ యాదవ్

ఆరిలోవ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్) ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఔషధ నియంత్రణ విభాగం కార్యాలయ భవనాలు, లేబొరేటరీని వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి వై.సత్య కుమార్ యాదవ్ మంగళవారం ఉదయం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నప్పుడే రాష్ట్రం ఆర్థికంగా పరిపుష్టి సాధించడం సాధ్యపడుతుందన్నారు. విశాఖ, కర్నూలుల్లో డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్స్‌ను ఏర్పాటుచేశామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొని భవనాలను ప్రారంభించిన తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ తన నియోజకవర్గంలో ఔషధ నియంత్రణ విభాగాలు ఏర్పాటు కావడం ఆనందంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో ఔషధ నియంత్రణ విభాగం డిప్యూటీ డైరెక్టర్ కె.రజిత, అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.విజయ్ కుమార్, విమ్స్ డైరెక్టర్ కె.రాంబాబు, స్థానిక కార్పొరేటర్



విమ్స్ ప్రాంగణంలో నూతన ప్రాంతీయ ఔషధ పరీక్ష ప్రయోగశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు. చిత్రంలో విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు ఉన్నారు.

... మిగతా 6వ పేజీలో

అద్దెకు స్టీల్‌ప్లాంటు క్వార్టర్లు

- యాజమాన్యం నిర్ణయంపై ఉద్యోగ వర్గాల విస్మయం
- ఉక్కు రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వడానికేమో నిరాకరణ
- హెచ్‌పీసీఎల్ ఉద్యోగులకు మాత్రం అవకాశం



స్టీల్‌ప్లాంట్‌లోని క్వార్టర్స్

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటు యాజమాన్యం వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవడంలో చాలా ఉత్సాహం ప్రదర్శిస్తోంది. ఉక్కు ఉద్యోగుల కోసం నిర్మించిన క్వార్టర్లను ఇప్పుడు హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) ఉద్యోగులకు అద్దెకు ఇవ్వాలని నిర్ణయించింది. దీనిపై ఉక్కు ఉద్యోగ వర్గాలు విస్మయం వ్యక్తంచేస్తున్నాయి. స్టీల్ ప్లాంటులో మూడు దశాబ్దాలకు పైగా పనిచేసి ఇక్కడే రిటైరైనవారు ఉండడానికి సింగిల్ బెడ్ రూమ్ క్వార్టర్ అద్దెకు ఇవ్వమంటే కుదరదని చెబుతున్న యాజమాన్యం మరో సంస్థ ఉద్యోగులకు ఎలా ఇస్తుందని ప్రశ్నిస్తున్నారు. స్టీల్ ప్లాంటు జనరల్ ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుగా పనిచేసిన ఒకామె సెక్టార్-1లో ఉంటున్నారు. ఆమెకు మనోవైకల్యం కలిగిన 30 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. ఇటీవల ఆమె రిటైరయ్యారు. తన కుమారుడి ఆరోగ్య రీత్యా అదే క్వార్టర్‌లో కొనసాగుతానని, మార్కెట్‌లో ఎంత అద్దె వస్తుందో అంత చెల్లిస్తానని లేఖలు మీద లేఖలు రాస్తుంటే ఏడాదిగా ఆమెకు అవకాశం ఇవ్వడం లేదు. రిటైరైనా ఇంకా ఉంటున్నారని జరిమానాతో అద్దె వసూలు చేస్తున్నారు. స్టీల్ ప్లాంటు కోసమే పనిచేసిన వారికి ఉండడానికి అవకాశం ఇవ్వని యాజమాన్యం హెచ్‌పీసీఎల్‌కు ఎలా ఇస్తుందని ఉద్యోగ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

స్టీల్ ప్లాంటులో 14 వేల మంది ఉద్యోగులు ఉండేవారు. వారి సంఖ్యను 9,500కు తీసుకువచ్చారు. ప్లాంటును పూర్తిస్థాయిలో నడపాలంటే ఇంకో రెండు వేల మందిని రిక్రూట్ చేసుకోవాలి. ఉద్యోగుల కోసం మూడు దశాబ్దాల క్రితం ఆరు వేల క్వార్టర్లు నిర్మించారు. కొన్ని

... మిగతా 6వ పేజీలో

నేరెళ్లవలసలో అక్రమంగా మట్టి తవ్వకాలు

- ఓ సొసైటీ లేఅవుట్‌కు రహదారి నిర్మాణం కోసం తరలింపు
- అడ్డుకున్న జనసేన కార్యకర్తలు
- జోక్యం చేసుకోవద్దని దళారుల హెచ్చరిక

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భీమిలి ఎర్రమట్టి దిబ్బల సమీపాన ఓ కో-ఆపరేటివ్ సొసైటీ కోసం రాత్రికి రాత్రి ప్రభుత్వ కొండ పోరంబోకులో మట్టిని అక్రమంగా తవ్వి తీసుకుపోతున్నారు. వారం రోజుల నుంచి రోజూ పదుల సంఖ్యలో లారీలు రాకపోకలు సాగిస్తున్నా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. కో-ఆపరేటివ్ సొసైటీ లేఅవుట్‌కు ఎస్‌ఓఎస్ ప్రాంతం నుంచి మట్టి రహదారి వేస్తున్నారు. 300 మీటర్ల పొడవు, 25 అడుగుల వెడల్పుతో ఏర్పాటుచేస్తున్న ఈ రహదారిని రెండు అడుగుల ఎత్తున మట్టి పోసి రోలింగ్ చేస్తున్నారు. దీనికి అవసరమైన మట్టిని

... మిగతా 6వ పేజీలో



చీకట్లో మట్టిని తవ్వుతున్న దృశ్యం



అక్రమంగా తెచ్చిన మట్టితో నిర్మిస్తున్న రహదారి

రాంబిల్లిలో సోలార్ కంపెనీ

- రూ.3,990 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు 'రెన్యూ ఎనర్జీ' సంస్థ సిద్ధం
- ప్లేట్ల తయారీ పరిశ్రమ ఏర్పాటు
- హైడ్రో స్టోరేజీ ప్రాజెక్టు, గ్రీన్ అమ్మోనియా ప్లాంటు, ఐదు గిగావాట్ల హైబ్రిడ్ రెన్యువబుల్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- మొత్తం పెట్టుబడి రూ.82 వేల కోట్లు

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశంలో తొలి ఇంటిగ్రేటెడ్ సోలార్ ఇన్‌గాట్ అండ్ వేఫర్ తయారీ పరిశ్రమ అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో ఏర్పాటు కానుంది. సోలార్ విద్యుత్ తయారీకి అవసరమైన ఫొటోవాల్టిక్ (సోలార్) పలకలను ప్రస్తుతం విదేశాల నుంచి భారీగా దిగుమతి చేసుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల సోలార్ విద్యుత్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో అనేక ప్రాజెక్టులు రూపుదిద్దుకుంటున్నాయి. వాటికి అవసరమైన ముడి సరకుకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఇక్కడే వాటిని తయారుచేయాలని రెన్యూ ఎనర్జీ గ్లోబల్ పీఎల్‌సీ' అనే సంస్థ రూ.3,999 కోట్లతో రాంబిల్లిలో ఇంటిగ్రేటెడ్ ప్లాంటు ఏర్పాటుకు ముందుకువచ్చింది. దీనికోసం రెన్యూ ఫొటోవాల్టాయిక్స్ పేరుతో అనుబంధ సంస్థను ఏర్పాటుచేసింది. ఆరు గిగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసే ఈ ప్లాంటు కోసం రాంబిల్లిలో 130 నుంచి 140 ఎకరాలు కావాలని కోరింది. రాష్ట్ర పెట్టుబడుల ప్రమోషన్ బోర్డు సిఫారసుతో ఈ ఫైల్ వచ్చే వారం రాష్ట్ర మంత్రివర్గం క్లియరెన్స్‌కు వెళుతున్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. అనుమతులు రాగానే పనులు ప్రారంభించి నిర్మాణాన్ని 2026 మార్చి నాటికి పూర్తి చేయాలని, వాణిజ్య కార్యకలాపాలను 2028 జనవరికి ప్రారంభిస్తామని సంస్థ తన ప్రతిపాదనల్లో

... మిగతా 6వ పేజీలో

మొక్కలు నాటిన వలంటీర్లు



మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

ఎండాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాస ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (సిమ్స్) ఎన్ఎస్ఎస్ యూనిట్ విభాగం వలంటీర్లు గొల్లల ఎండాడ పార్కుతో పాటు సీఎంఆర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో వ్యర్థాలను తొలగించి శుభ్రపరిచారు. సిమ్స్ డైరెక్టర్ వి.సాయి ప్రశాంత్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ జి.సుధాకర్ పాల్గొన్నారు.

14న యునైటెడ్ క్రిస్మస్

భీమునిపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీసస్ పార్క్ వద్ద ఈనెల 14 న యునైటెడ్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్టు వైఎంసీఏ నాయకులు కేఎస్ఎమ్ సుధాకర్ తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హాజరవుతారన్నారు. అతిథులుగా యువనేత గంటా రవితేజ, డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొంటారన్నారు.

కారు బీభత్సంపై కేసు నమోదు

భీమునిపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బీచ్‌రోడ్డులో సోమవారం మధ్యాహ్నం బీభత్సం సృష్టించిన కారు ఘటనలో డ్రైవరుపై పోలీసులు కేసు నమోదు చేశారు. రుషికొండ గీతం ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న కలిదిండి ప్రశాంత్‌కుమార్‌రాజు నలుగురు స్నేహితులలో కారులో బీచ్‌కి వచ్చి అతివేగంగా నడపడంతో అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. వాహనాన్ని మల్కాపురం ఏరియాకు చెందిన బాలుడు నడిపాడని, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడంతో కేసు నమోదు చేశామని సీఐ తిరుమలరావు తెలిపారు.

14న మెగా రక్తదాన శిబిరం

భీమునిపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భీమిలి నీడీ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14న మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్టు సంస్థ అధ్యక్షుడు కైతపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ది సన్ స్కూల్ ఆవరణలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకూ జరిగే శిబిరంలో పెద్దసంఖ్యలో ప్రజలు హాజరై రక్తదానం చేయాలని ఆయన కోరారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

భీమునిపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బీచ్‌రోడ్డులోని అయ్యప్పస్వామి దేవాలయం 20వ వార్షికోత్సవం ఈ నెల 10న నిర్వహిసున్నట్టు ట్రస్ట్ అధ్యక్షుడు సుసరాపు కామేశ్వర మాధవశాస్త్రి తెలిపారు. ప్రతి బుధవారం ఆలయం వద్ద ఉదయం ఉచితంగా అల్పాహారం ఏర్పాటు చేశామన్నారు. ఆఖరి బుధవారం అల్పాహారాన్ని మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, చెన్నా వెంకటేష్‌ల సహకారంతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామని, అధిక సంఖ్యలో మాలధారణ స్వాములు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

'తూకంలో మోసాలు అరికట్టాలి'

పద్మనాభం-రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ధాన్యం తూకాల్లో మోసాలు అరికట్టేందుకు వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించడం లేదని ఆరోపిస్తున్నారు. తుకాల్లో మోసాలపై జిల్లా ఉన్నతాధికారులు, ఏవోలు సూచనలు అమలు కావడం లేదంటున్నారు. మిల్లర్లు, మధ్యవర్తులు రైతులను మోసం చేస్తే వెంటనే సంప్రందించాలని అధికారులు చేస్తున్న ప్రకటనలు ఫలితమివ్వడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పర్యటించి ధాన్యం తూకాల్లో జరుగుతున్న అక్రమాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఆనందపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలోని వెల్లంకి జాతీయ రహదారి వద్ద మంగళవారం ఘోర ప్రమాదం తప్పింది. తగరపువలసకు చెందిన కుటుంబం కారులో విశాఖపట్నం వెళ్తుండగా వెల్లంకి వద్ద వేములవలస వైపు మలుపు తిరుగుతుండగా, వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ సంఘటనలో కారు వెనుక భాగం పూర్తిగా నుజ్జయింది. కారులో ఉన్న వారికి గాయాలు కూడా కాకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. కారు డ్రైవరు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ చింతా వాసునాయుడు తెలిపారు.

భజన కళాకారులకు సత్కారం



కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం

తగరపువలస, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సంతపేటలో భజన గురువు ఊడికల నరసింగరావు వర్ధంతి సందర్భంగా మంగళవారం 60 మంది భజన కళాకారులను వారి కుటుంబసభ్యులు సత్కరించారు. జగదీష్, శ్రీనివాసరావు, లక్ష్మి, యమున కళాకారులను ఆహ్వానించారు ఉషారాణి కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి ఉప్పాడ అప్పారావు అధ్యక్షతన న్యాయవాది ఎన్.లోకనాథరావు ముఖ్య అతిథిగా పాల్గొని కళాకారులను సత్కరించారు., ఎన్.సుగుణ జీవీ రమణ, కె.సూర్యనారాయణ, చిరంజీవి, నరసింగరావు, ప్రసాదరావు పాల్గొన్నారు. .

ఉత్సాహంగా స్మార్ట్ ఇండియా హ్యాకథాన్

సాగర్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యువతలో వినూత్న ఆలోచనలు ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖ ఇన్నోవేషన్ సెల్, అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ ఫైనల్ పోటీలు గీతంలో ఉత్సాహపూరిత వాతావరణంలో జరుగుతున్నాయి. పోటీలను పర్యవేక్షించడానికి ఏఐసీటీ అధికారులు, సిద్ధార్థ శర్మ, రంగనాథ్ ఓజాతో పాటు ఎన్‌డీఆర్ఎఫ్ అధికారులు సుకేందు దత్తా, రిషిమహజన్, రంజిత్‌కుమార్ మిశ్రా, అరవిందకుమార్, ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ డీఐజీ పవన్‌మాలిక్, డిప్యూటీ కమాండెంట్ గౌతమ్‌కుమార్, ట్రైనీటెక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.సత్యేంద్ర, కృత్రిమ మేధ నిపుణులు సూర్‌వంక, గీతం ప్రొఫెసర్‌లు ఆర్.రాజేశ్వరరెడ్డి, క్రాంతికిరణ్ హాజరయ్యారు. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ పోటీలకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 25 విద్యార్థి బృందాలు, 171 మంది యువతీ యువకులు పాల్గొన్నారు. పర్యవేక్షకుడిగా వ్యవహరిస్తున్న గీతం వీడీసీ కోచ్ బి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ పోటీలలో పాల్గొనే జట్లు నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్ఎఫ్), ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్‌కు సంబంధించిన ఐదు అంశాలపై పరిష్కార మార్గాలు తెలపాల్సిందిగా కోరామన్నారు. దేశవ్యాప్తంగా 60 విద్యాలయాల్లో జరుగుతున్న స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ పోటీల్లో పాల్గొంటున్న యువతను ఉద్దేశించి కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి డా.సుకంతా మజుందార్ మంగళవారం వర్చువల్‌గా ప్రసంగించారు. న్యాయనిర్ణేతల సమక్షంలో స్మార్ట్‌ఇండియా హ్యాకథాన్ జట్ల ఆలోచనలను పరిశీలించి ఈ నెల 12న విజేతలను ప్రకటిస్తారు.



హ్యాకథాన్‌కు హాజరైన వివిధ రంగాలకు చెందిన అధికారులు

4న గీత సహకులాల వన సమారాధన



వన సమారాధన పోస్టర్ ఆవిష్కరిస్తున్న గీత సహకులాల నాయకులు

భీమునిపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విశాఖ పార్లమెంటు పరిధి గీత సహకులాల వన సమారాధన భారీ ఎత్తున జనవరి 4న నిర్వహించనున్నట్టు గీత సహకులాల సమైక్య అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం పట్టణంలోని నేరెళ్లవలస కాలనీలో టీడీపీ నాయకులు చిట్టిబోయిన రాము అధ్యక్షతన గీత సహకులాల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీనివాసరావు మాట్లాడుతూ నగరంలోని ముడసర్లోవ పార్క్‌లో ఈ వన సమారాధన నిర్వహించడానికి ఏర్పాట్లు చేసున్నట్టు చెప్పారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సామాజిక, రాజకీయ, ఆర్థికంగా వెనుకబడి ఉన్న తమ కులాలు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సందర్భంగా ప్రభుత్వ దృష్టికి తీసుకువెళనున్నందున అత్యధిక సంఖ్యలో గీత సహకులాల వారు వన సమారాధనకు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. ఏపీ యాత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, తెలుగుదేశం బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి అంగటి రాము మాట్లాడుతూ ఈ వన సమారాధనకు భీమిలి నియోజకవర్గం నుంచి అత్యధిక సంఖ్యలో గీత సహకులాలవారు తరలిరావాలని కోరారు. సమావేశంలో శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ అనుసూరి మధుసూదన్, యాత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బాడితబోయిన రాములప్పడు, నాయకులు బుత్తల నర్సింగరావు, రీసు రమణ, కాకర ఎల్లారావు, చెల్లుబోయిన గోవింద తదితరులు పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

» ఆర్డీవోకు వినతిపత్రం అందించిన యూటీఎఫ్ నాయకులు



భీమిలి ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

భీమునిపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీసు టీచర్లకు టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ యూటీఎఫ్ డిమాండ్ చేసింది. మంగళవారం భీమిలి ఆర్డీవో కార్యాలయం ముందు యూటీఎఫ్ ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. అనంతరం ఆర్డీవో సంగీత్ మాథుర్‌కు వినితిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నేతలు మాట్లాడుతూ ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని కోరారు. అలాగే, ఆర్టీఐ యాక్టు సెక్షన్ 23(ఎ)ను అమెండ్‌మెంట్ చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. రెండో శనివారం, ఆదివారం ఉపాధ్యాయులకు ప్రత్యేక తరగతులు నిర్వహించవద్దని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేద్కర్, జిల్లా గౌరవాధ్యక్షులు అనకాపల్లి పైడిరాజు, యూటీఎఫ్ భీమిలి మండల శాఖ అధ్యక్షుడు సంతోష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎల్ఏ శ్రీనివాసరావు, నాయకులు మరగడ రామకృష్ణ, మహేష్, సంతోష్, ఎస్.రమణ, రామకృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు చిప్పాడ పాఠశాల బాలికలు



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిప్పాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థినులు దేవాడ రోజ్‌మేరీ, వెంపాడ వాసవి కౌశల్ 2025 సైన్సు ప్రతిభాన్వేషణ పోటీల్లో విజేతలుగా నిలిచారు. వీరికి జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ మంగళవారం ఉదయం జ్ఞాపికలు, నగదు పురస్కారాలను అందజేశారు. వీరుఈ నెల 22న చిత్తూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. బాలికలను మంగళవారం హెచ్ఎం ఎం.రత్నం, ఉపాధ్యాయులు అభినందించారు.

గురుకులంలో వన భోజన సందడి



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సింహాచలం, డిసెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): విద్యార్థుల ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆనందోత్సాహాల నడుమ సింహాచలంలోని మహాత్మా జ్యోతిబా పులే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థుల వన భోజనాల కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ గుణుపూరు పురుషోత్తి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. వివిధ గురుకులాల ప్రిన్సిపాళ్లు రామామోహిని, యూవీకే పాత్రో, ఎం.రూప, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ నైపుణ్యాలపై శిక్షణ: డీఐజీ



మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్‌జెట్టీ

సాగర్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మెరైన్ పోలీస్ ఆధునికీకరణలో భాగంగా మొదటవిడతగా నార్త్ కోస్టల్ సెక్యూరిటీ సిబ్బందికి మంగళవారం రుషికొండ కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌స్టేషన్‌లో రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి పర్యవేక్షణలో కమ్యూనికేషన్ నైపుణ్యాలపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ తీర ప్రాంత భద్రతలో పోలీస్‌సిబ్బందికి కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెంపొందించడంతో పాటు, వారి సేవలను సమర్థంగా, వేగవంతంగా అందించడమే లక్ష్యమన్నారు. ప్రతికోస్టల్ పోలీస్‌స్టేషన్‌కు నూతన కమ్యూనికేషన్ సెట్లను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కమ్యూనికేషన్ ఎస్పీ జి.సూర్యకుమార్, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ అడిషనల్ ఎస్పీ మధుసూదనరావు, కమ్యూనికేషన్ డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

చిట్టివలస కార్మికుల చలో ఢిల్లీ

తగరపువలస, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పింఛనుదారుల సమస్యలను పరిష్కరించాలని దేశవ్యాప్త ఆందోళన కార్యక్రమం చేపట్టిన చిట్టివలస జూట్‌మిల్లు కార్మికులు మంగళవారం న్యూఢిల్లీ చేరుకున్నారు. పింఛను మొత్తాన్ని నెలకు రూ.9 వేలుగా పెంచాలని చేయాలన్నది తమ ప్రధాన డిమాండ్ అని సీఐటీయూ అధ్యక్షుడు ఎస్.అప్పలనాయుడు, పింఛనుదారుల సంఘం అధ్యక్షుడు డి.బాలాజీ, ఇతర నాయకులు రాంబాబు, అప్పలరాజు తదితరులు తెలియజేశారు. ఆరోగ్య బీమా వర్తింపజేయాలని, మెడికల్ బిల్లులు చెల్లించాలని, బస్సుల్లోనూ రైళ్లలలోనూ రాయితీ ప్రయాణాలకు అనుమతించాలని కోరుతున్నామన్నారు. ఢిల్లీలో కార్మికశాఖ, పీఎఫ్ కార్యాలయం వంటి వివిధ కార్యాలయాలను సందర్శించామన్నారు. తమ జాతీయ నాయకులు సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతారని తెలిపారు.

అప్పన్న ఆలయంలో తిరుమంజన సేవ



ఆలయ తిరుమంజన సేవలో అధికారులు

సింహాచలం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన ధనుర్మాసోత్సవాల ప్రారంభ సూచికగా అప్పన్న ఆలయంలో 'కోయిల్ ఆళ్వార్ తిరుమంజన' సేవ చేపట్టారు. దానిలో భాగంగా అధికారులు ముందుగా ప్రకటించిన విధంగా మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో భక్తులకు స్వామివారి దర్శనాలు నిలుపుదల చేశారు. దేవాలయ ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో అప్పన్న ఆలయాన్ని గంగధార నుంచి తరలించిన పవిత్ర జలాలతో శుభ్రపరిచారు. రంగవల్లులతో తీర్చిదిద్ది సాయంత్రం 4 గంటలకు స్వామివారి దర్శనాలు కల్పించారు. ఏఈఓ కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షణాధికారి బి.సత్యశ్రీనివాస్, పీఆర్ఓ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా పరిణయోత్సవం

వరాహలక్ష్మీనృసింహస్వామికి నేత్రపర్వంగా పరిణయోత్సవాన్ని (నిత్యకల్యాణం) నిర్వహించారు. సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి కంకణధారణ చేశారు. తరువాత స్వామికి నూతన యజ్ఞోపవీత సమర్పణ కావించి మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చరణల నడుమ జీలకర్రా బెల్లం, మాంగల్యధారణను సంప్రదాయబద్ధంగా జరిపారు.

'వైసీపీ ర్యాలీని విజయవంతం చేయాలి'

ఆనందపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలను ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తోందని ఆరోపిస్తూ బుధవారం తగరపువలసలో చేపడుతున్న ర్యాలీని విజయవంతం చేయాలని వైసీపీ భీమిలి కన్వీనర్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని వేములవలసలో సంతకాలు సేకరించారు. మూడు మండలాల్లో 50 వేల సంతకాలతో సేకరించిన పత్రాలతో ర్యాలీ నిర్వహించి జిల్లా కార్యాలయానికి చేరవేస్తామన్నారు. మజ్జి సిరమ్మ, మజ్జి వెంకటరావు, గంద్రెడ్డి స్వామినాయుడు, వెంకటరావు, గిరిబాబు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

తీరానికి కొట్టుకువచ్చిన ముళ్ల కప్పకళేబరాలు



తీరానికి కొట్టుకువచ్చిన ముళ్ల కప్ప కళేబరాలు

సాగర్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సాగర్‌నగర్ సముద్రతీరానికి మంగళవారం ముళ్లకప్ప కళేబరాలు కొట్టుకు వచ్చాయి. ఏటా శీతాకాలంలో సముద్ర జీవరాశులు మృత్యువాత పడి తీరాలకు కొట్టుకు వస్తుంటాయి. సముద్ర ఉపరితలంపై వాతావరణ మార్పులో, లేక సముద్ర జలాల కాలుష్య ప్రభావమో ఈ సీజన్‌లో ఎక్కువగా ఆలివ్ రిడ్లీలు, సముద్ర కప్పలు విగత జీవులుగా చేరుతున్నాయి. ఇవి కుళ్లి తీరప్రాంతాలలో దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. బీచ్‌లకు వచ్చే సందర్శకులు ఈ దుర్గంధాన్ని భరించలేకపోతున్నారు.

చెత్త నుంచి సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి

» జిల్లా పరిషత్ సీఈఓ నారాయణమూర్తి



విలాస్ఖాన్‌పాలెంలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ నారాయణమూర్తి

పద్మనాభం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.నారాయణమూర్తి పేర్కొన్నారు. మండలంలోని విలాస్ఖాన్‌పాలెం పంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పనితీరును మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ ఉద్యోగులతో మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. సేకరించిన చెత్తను ఈ కేంద్రానికి తీసుకొచ్చి తడి చెత్తను వానపాము ఎరువుగా తయారు చేయించాలన్నారు. పొడి చెత్తను రకాల వారీగా వేరు చేయించి పునర్వినియోగానికి అవసరమైన వాటిని వినియోగించి మిగిలిన వాటిని విక్రయించాలన్నారు. తద్వారా ఈ కేంద్రాన్ని పంచాయతీలు ఆదాయ వనరుగా మార్చుకోవాలన్నారు. మంచినీటి పథకాలను క్రమం తప్పకుండా క్లోరినేషను చేయించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో వి.నరేష్, ఈవోపీఆర్‌డీ బీవీ రమణ, ఎంపీటీసీ సభ్యురాలు బోని సావిత్రి, సన్యాసినాయుడు, జనసేన నేతలు బోని బంగారునాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందపురం: మండలంలోని ముచ్చర్ల, గండిగుండం, కణమాం పంచాయతీల్లో మంగళవారం డివిజినల్ డెవలప్‌మెంట్ అధికారి నిర్మలాదేవి పర్యటించారు. కణమాం సచివాలయంలో సిబ్బందితో రివ్యూ సమావేశం నిర్వహించి ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని సూచించారు. హౌస్ ట్యాక్స్ స్వామిత్వ సర్వేపైవాకబు చేశారు. గోరింట గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి సూచనలు చేశారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి 12 కేంద్రాల్లో టెట్

మహారాణిపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బుధవారం (నేటి) నుంచి ఈ నెల 21 వరకు జిల్లాలోని 12 కేంద్రాలలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో పరీక్ష నిర్వహణ అధికారులతో సమావేశమయ్యారు. విశాఖ జిల్లాలో 11, అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో ఒక కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులతో కలసి మొత్తం 26,248 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు. రెండు పూటలా నిర్వహించే పరీక్ష సజావుగా జరిగేలా అధికారులు సహకరించాలని డీఈవో కోరారు. తమ కార్యాలయంలో ప్రత్యేక డెస్కు ఏర్పాటు చేశామని, అధికారులు లేదా అభ్యర్థులు సహాయం కోసం 91772 92969, 96185 84051, 83285 24861 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

14న వైజాగ్ నేవీ మారథాన్

... 5వ పేజీ తరువాయి

నేవీ థీమ్ మెడల్, గూడీ బ్యాగ్, అల్పాహారం అందజేస్తారన్నారు. ప్రజలకు శారీరక దృఢత్వం, సముద్ర వ్యవహారాలపై అవగాహన పెంచడమే దీని ఉద్దేశమన్నారు. దీనికి ముందు ఆయన నేవీ, జిల్లా అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో నేవీ కెప్టెన్లు టీఆర్ఎస్ కుమార్, వినోత్ తివారీ, కమాండర్ కిశోర్, లెఫ్టినెంట్ కమాండర్లు పి.మోహంత్ నాయుడు, నరేశ్, ఏడీసీ రమణమూర్తి, ఈపీడీసీఎల్ ఎస్ఈ శ్యాంబాబు పాల్గొన్నారు.

విమ్స్‌లో ఔషధ నియంత్రణ విభాగం కార్యాలయం, ల్యాబ్

... 5వ పేజీ తరువాయి

మద్దిల రామలక్ష్మి, 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, నాయకులు బుడమూరు గోవింద్, తదితరులు పాల్గొన్నారు. ఔషధ నియంత్రణ మండలి డైరెక్టర్ ఎం.పాండురంగారావు వర్చువల్‌గా పాల్గొని మాట్లాడారు.డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీల సమయంలో అనుమానం వచ్చి సేకరించిన నమూనాలను ఔషధ నియంత్రణ విభాగంలో పరీక్షిస్తారు. టాబ్లెట్స్, దగ్గు మందులు, ఇతర ఔషధాలను పరీక్షిస్తారు.

రాంబిల్లిలో సోలార్ కంపెనీ

... 5వ పేజీ తరువాయి

పేర్కొంది. దీంతో పాటు రెండు గిగావాట్ల హైడ్రో స్టోరేజీ ప్రాజెక్టు, 300 కేటీపీఏ సామర్థ్యంతో గ్రీన్ అమ్మోనియా ప్లాంటు, ఐదు గిగావాట్ల హైబ్రిడ్ రెన్యువబుల్ ప్రాజెక్టులు (విండ్, సోలార్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్) ఏర్పాటుచేస్తుంది. వీటన్నింటికీ కలిపి రూ.82 వేల కోట్లు పెట్టుబడి పెడతామని ఇటీవల జరిగిన సీఐఐ పెట్టుబడిదారుల సదస్సులో ఒప్పందం చేసిందని తెలిసింది. వీటిని నడపడానికి రోజుకు 95 మెగావాట్ల నిరంతర విద్యుత్, రోజుకు పది మిలియన్ లీటర్ల నీరు అవసరమని, అందుకు తగిన ఏర్పాట్లుచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.

శతాబ్ది ఉత్సవాల వేళ... అభివృద్ధి మేళా

... 5వ పేజీ తరువాయి

అత్యాధునిక భవనాన్ని నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఇంకా 24 వేల చదరపు అడుగుల్లో సెంట్రలైజ్డ్ కిచెన్, భోజనశాల నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. కేంద్ర పరిశోధన కేంద్రం నిర్మించనున్నారు. ఇందులో అత్యాధునిక పరిశోధన పరికరాలను ఏర్పాటు చేయనున్నారు. వర్సిటీ వందేళ్లు పూర్తి చేసుకుంటున్న తరుణంలో కీలకమైన ప్రాజెక్టులను చేపట్టాలన్న ఉద్దేశంతో ప్రణాళికలు రూపొందించామని రిజిస్ట్రార్ రాంబాబు తెలిపారు.

ఆయా ప్రాజె క్టులకు సంబంధించిన ప్రతిపాదనలు ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపించామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించా యన్నారు. రానున్న 50 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టులను చేపడుతున్నట్టు ఆయన తెలిపారు.

నేరెళ్లవలసలో అక్రమంగా మట్టి తవ్వకాలు

... 5వ పేజీ తరువాయి

నేరెళ్లవలస సర్వే నంబరు 4లో కొండ పోరంబోకు స్థలంలో తవ్వుతున్నారు. ఇప్పటివరకూ సుమారుగా 280 లారీల మట్టిని తీసుకువెళ్లినట్టు స్థానికులు చెబుతున్నారు. సోమవారం రాత్రి స్థానిక జనసేన నాయకులు మట్టి లారీలను అడ్డుకుంటే దళారులు రంగ ప్రవేశం చేసి బెదిరింపులకు దిగారు. జనసేన పార్టీలో పెద్దలతో చెప్పి మంచి పదవి ఇప్పిస్తామని, లారీల జోలికి రావద్దని హెచ్చరించారు. ఈ సొసైటీ సభ్యులు కొన్ని దశాబ్దాలుగా తమ భూమి కోసం న్యాయపోరాటం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచే తాము భూమిని తీసుకున్నామని వారు మొర పెట్టుకున్నా ఎర్రమట్టి దిబ్బలు కలిగిన ప్రాంతం కావడంతో త్వరగా అనుమతులు రావడం లేదు. ఆ పనులన్నీ తాము చేసి పెడతామంటూ దళారులు రంగంలో దిగి పబ్బం గడుపుకొంటున్నారు. ఈ మట్టి తవ్వకాలపై మైనింగ్, రెవెన్యూ శాఖలు దృష్టి పెట్టి, తక్షణమే అడ్డుకట్ట వేయాల్సి ఉంది.

13న ఏయూ పూర్వ విద్యార్థుల సమావేశం

... 5వ పేజీ తరువాయి

వ్యవస్థాపక అధ్యక్షులు గ్రంధి మల్లికార్జునరావు, తదితరులు పాల్గొంటారన్నారు. ఇప్పటివరకూ పది వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, రెండు వేల మందికిపైగా హాజరవుతారన్నారు. ప్రధాన వేదికతోపాటు ప్రాంగణం వెలుపల ప్రత్యేక స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ 13వ తేదీ మధ్యాహ్నం ఏయూ పరిపాలనా భవనం వద్ద ఉన్న వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహానికి ముఖ్య అతిథి పూలమాల వేసి నివాళులు అర్పిస్తారన్నారు. వార్షిక పూర్వ విద్యార్థుల సమావేశానికి వర్సిటీపరంగా సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ప్రపంచవ్యాప్తంగా స్థిరపడిన ఏయూ పూర్వ విద్యార్థులను అనుసంధానిస్తామని, విశ్వవిద్యాలయ అభివృద్ధిలో వారిని భాగస్వామ్యులను చేస్తామని చెప్పారు. విశ్వవిద్యాలయం భవిష్యత్తు ప్రణాళికల ను వారికి వివరించే ప్రయత్నం చేస్తామన్నారు. శతాబ్ది ఉత్సవాల్లో పూర్వ విద్యార్థులను భాగస్వామ్యులను చేస్తామన్నారు.

డిసెంబర్ 13వ తేదీ ఉదయం ప్రతి విభాగంలో పూర్వ విద్యార్థులతో ఆత్మీయ సమ్మేళనాలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనం వేవ్స్-2025 కార్యక్రమ వివరాలతో కూడిన పోస్టర్‌ను వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ అలుమ్ని చైర్మన్ కేవీవీ రావుతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు డాక్టర్ కె.కుమార్‌రాజ, జనరల్ సెక్రటరీ ఆకుల చంద్రశేఖర్, ఈసీ సభ్యులు డాక్టర్ ఎస్‌కేఈ అప్పారావు, ప్రొఫెసర్ బి.మోహన వెంకటరామ్, వైవీ అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

అద్దెకు స్టీల్ ప్లాంటు క్వార్టర్లు

... 5వ పేజీ తరువాయి

నిర్వహణ లేకపోవడంతో పాముల నిలయాలుగా మారాయి. పొదలు పెరిగిపోయాయి. టౌన్‌షిప్‌కు ఓ మూలగా సెక్టార్-12లో సి, డి-టైప్ క్వార్టర్లు ఉన్నతాధికారుల కోసం నిర్మించారు. 1,300 చ.అ. విస్తీర్ణంలో 3 బెడ్‌రూమ్స్ ఉంటాయి. వీటిని ఇప్పుడు హెచ్‌పీసీఎల్ ఉద్యోగులకు అద్దెకు ఇవ్వాలని యాజమాన్యం నిర్ణయించింది. దీనిపై హెచ్‌పీసీఎల్ యాజమాన్యం వారి ఉద్యోగులకు లేఖలు పంపుతోంది. ఆ క్వార్టర్లను తీసుకోవడానికి ఎవరికైనా ఆసక్తి ఉంటే సమాధానం ఇవ్వాలని, దాని ప్రకారం స్టీల్ ప్లాంటుతో ఒప్పందం చేసుకుంటామని చెబుతోంది. ఇలా డి-టైప్ క్వార్టర్లలో ఓ 20 వరకు అద్దెకు ఇవ్వడానికి అనువుగా ఉన్నాయి. వాటి ద్వారా మహ వస్తే నెలకు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల అద్దె వస్తుంది. ఆ ఆదాయం కోసం మరో సంస్థకు అద్దెకు ఇవ్వాల్సిన అవసరం ఉందా?...అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

ఎవరూ చేరకపోవడం వల్లనే

ఇటీవల ఉద్యోగులు అందరికీ బలవంతంగా క్వార్టర్లు కేటాయిస్తున్నారు. అయినా చాలామంది ఈ సి, డి క్వార్టర్లు తీసుకోవడానికి ముందుకురావడం లేదు. ఖాళీగా ఉంటే పాడైపోతాయని, ఎంతో కొంత ఆదాయం వస్తుందనే ఆలోచనతోనే ఈ ప్రతిపాదన చేశామని ప్లాంటు యాజమాన్యం చెబుతోంది.

నిర్వహణ లోపంతో అధ్వానంగా కేడీపీఎం స్కూలు

» వినియోగించలేని దుస్థితిలో మరుగుదొడ్లు » తరగతి గదుల్లోకి వ్యాపిస్తున్న దుర్గంధం

పెదవాల్తేరు డిసెంబర్ 9 : ఈస్టు పాయింట్ కాలనీలోని జీవీఎంసీ కేడీపీఎం ఉన్నత పాఠశాల పరిస్థితి అధ్వానంగా ఉంది. పాఠశాలలోని మరుగుదొడ్లు నిర్వహణ సరిగా లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్ల నుంచి వెలువడుతున్న దుర్గంధం కారణంగా తరగతుల్లో కూడా కూర్చోలేక పోతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో పరిస్థితిని చూస్తున్న తల్లిదండ్రులు తమ పిల్లలకు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.


టాయ్‌లెట్‌లో విరిగిపోయిన ట్యాపులు, కమోడ్


ట్యాపులు విరిగిపోవడంతో వృథాగా పోతున్న నీరు

స్కూలులోని మరుగుదొడ్లు పూర్తిగా శిథిల స్థితికి చేరాయి. ఏమాత్రం నిర్వహణ చేపట్టకపోవడంతో వీటిని వినియోగించడం చాలా ఇబ్బందిగా మారింది. ఇక్కడ బాలురకు మూడు మరుగుదొడ్లు ఉన్నాయి. రెండు మరుగుదొడ్లలో ట్యాపులు విరిగిపోయాయి. దీంతో నీరు వృథాగా పోతోంది. అయినప్పటికీ పట్టించుకునే వారే లేరు. మరో బాత్రూంకు తాళం వేసి ఉంది. దీంతో ఇక్కడ చదువుతున్న 414 మంది బాలురు నానా యాతన అనుభవిస్తున్నారు.

ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో సకల వసతులు కల్పించామని, నాణ్యమైన విద్య అందిస్తున్నామని ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నారు.అయితే వాస్తవ పరిస్థితులు మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నాయన్న విషయం కేడీపీఎం స్కూలు పరిస్థితి చూస్తే అర్థమవుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు వ్యాఖ్యానిస్తున్నారు.


వాష్‌బేసిన్ల వద్ద పని చేయని ట్యాపులు

గత కొన్నేళ్ల కిందట ఈ స్కూలులో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా రూపొందించారు. తరగతి గదులకు రంగులు, క్రీడా మైదానం, ఆర్వో ప్లాంట్, విద్యార్థుల కోసం తాగునీరు, కొళాయిలతో పాటు అదనపు క్లాసు రూమ్‌లను అందుబాటులోకి అధికారులు తీసుకొచ్చారు. ఈ ఏడాది 782 మంది విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. ఇందులో బాలికలు 368 కాగా, బాలురు 414 మంది ఉన్నారు. అయితే కేవలం నిర్వహణ లోపం కారణంగా ఈ స్కూలు పరిస్థితి అధ్వానంగా తయారైంది.

ఈ స్కూల్‌లో మరుగుదొడ్లతో పాటు, ఆర్వోప్లాంటు, మంచి నీరు కొళాయిలు మూలకు చేరి పాఠశాల అవరణ అధ్వానంగా తయారైంది. వరండా, బాత్‌రూమ్‌లు, అధ్వానంగా ఉన్నా ఉపాధ్యాయులు, అధికారులు పరిశుభ్రతకు ఎలాంటి శ్రద్ధ తీసుకోక పోవడంపై విమర్శలు వెల్లుతున్నాయి. అధికారుల దృష్టికి సమస్యను ఉపాధ్యాయులు తీసుకెళ్లారో లేదో అర్థం కావడం లేదని పలువురు తల్లిదండ్రులు, స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఒక వేళ పరిస్థితి ఇలా ఉందని తెలిసినా అధికారులే నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారో తెలియడం లేదని వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాల పరిసరాల శుభ్రత గురించి చూస్తే ఇది పాఠశాల... డంపింగ్ యార్డా... అనే సందేహం కలగకమానదు. అంతస్థాయిలో చెత్త పేరుకుపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాల అవరణలో పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కుంగిన రోడ్డుకు మరమ్మతులు

» ఎట్టకేలకు స్పందించిన అధికారులు » రూ.49 లక్షలతో పనులు


కొనసాగుతున్న మరమ్మతు పనులు

బీచ్‌రోడ్డు, డిసెంబర్ 9 (ఆంధ్రజోతి) : బీచ్ రోడ్డులో కుంగిన రహదారికి ఎట్టకేలకు మరమ్మతులకు అధికారులు చర్యలు తీసుకున్నారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు వరద నీరు పోటెత్తి బీచ్ రోడ్డు కుంగిపోయి వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో జీవీఎంసీ అధికారులు రూ.49 లక్షల నిధులతో మరమ్మతులు చేపట్టారు. అక్కడ బాక్స్ విధానంలో కల్వర్టు నిర్మాణం చేపడుతున్నామని అధికారులు తెలిపారు. దీనివల్ల వరద నీరు వచ్చినా.. రహదారి కోతకు గురికాకుండా ఉంటుందన్నారు. మరో నెల రోజుల్లో పనులు పూర్తవుతాయని అసిస్టెంట్ ఇంజినీరు దేవి తెలిపారు.

వాహనదారులు, పాదాచారుల అవస్థలు...

బీచ్ రోడ్డులో భారీ గుంత ఏర్పడడంతో ఇన్నాళ్లూ వాహనదారులు నరకం చూశారు. జీవీఎంసీ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా ఇన్నాళ్లూ పట్టించుకోలేదు. తాజాగా.. రూ.49 లక్షలు మంజూరు చేయడంతో మరమ్మతులు జరుగుతున్నాయి. రోడ్డు మరమ్మతు పనులు చేయడం వల్ల తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. తీరానికి వచ్చే సందర్శకులు వాహనాలను రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఎదురవుతున్నది. సందర్శకులు వాహనాలను ఫుట్‌పాత్‌ల మీద పార్కింగ్ చేసి గంటల తరబడి ఉంచేస్తున్నారు.

దీంతో ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని తలపిస్తోంది. ముఖ్యంగా మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్ నుంచి వచ్చిన సందర్శకులు రోడ్డులో ప్రైవేట్ ట్రావెల్స్ వాహనాలన్నీ రోడ్డు మీదే పార్కింగ్ చేసే తమ వ్యాపారాన్ని నిర్వహించుకుంటున్నారు. దీంతో ఫుట్‌పాత్‌ల మీద నడవవలసిన పాదాచారులు రోడ్డు మీద నడవవాల్సి వస్తోంది. దీంతో చాలామంది వాహనాలు ఢీకొని గాయాల పాలవుతున్నారు. సమస్య ఇంత తీవ్రంగా ఉన్నా రోడ్డు మధ్యలో భారీ గుంతకు మోక్షం కలగనుండడం సంతోషంగా ఉందని పలువురు అంటున్నారు.

రేషన్ డిపోల్లో విస్తృత తనిఖీలు


మద్దిలపాలెం రేషన్ డిపోలో తనిఖీలు చేస్తున్న డీఎస్వో నారాయణ

మద్దిలపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం, ఇసుకతోట ప్రాంతాల్లోని రేషన్ డిపోల్లో మంగళవారం పౌరసరఫరాల శాఖాధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. డీఎస్వో నారాయణ నేతృత్వంలో డిపోల్లో రేషన్ సరుకుల పంపిణీ పరిశీలించారు. బియ్యం, పంచదార నాణ్యత, తూనికలు, కొలతల మిషన్లు సరిగ్గా పని చేస్తున్నాయో లేదో తనిఖీ చేశారు. డీలర్లు సమయానికి డిపోలు తెరుస్తున్నారా? లేదా? అంటూ కార్డుదారులు, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్వో నారాయణ మాట్లాడుతూ రేషన్ సరుకుల పంపిణీలో ఎలాంటి అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీలర్లు సమయపాలన పాటించి సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలని సూచించారు.

సర్కిల్-3 ఏఎస్‌వో సస్పెన్షన్

గాజువాక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గాజువాక సర్కిల్-3 ఏఎస్‌వో టి.కృష్ణను సస్పెండ్ చేస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత బుధవారం లంచం తీసుకుంటూ ఏఎస్‌వో టి.కృష్ణ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కృష్ణను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సర్కిల్-1 ఏఎస్‌వోగా విధులు నిర్వహిస్తున్న శ్రీహరికు సర్కిల్-3 ఏఎస్‌వోగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

వైసీపీ నాయకుల మధ్య తోపులాట

58వ వార్డు కార్పొరేటర్‌కు, వార్డు అధ్యక్షుడికి గాయాలు

మల్కాపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మింది గ్రామంలోని ఉన్న మళ్ల విజయప్రసాద్ స్టూడియోలో మంగళవారం వైసీపీ కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశం ముగిసిన అనంతరం 58వ వార్డుకు చెందిన వైసీపీ నాయకుడు వంగ శ్రీనుకు, వైసీపీ వార్డు అధ్యక్షుడు గులిగిందల కృష్ణకు ఓ విషయమై మాటామాటా పెరిగి తోపులాటకు దారి తీసింది. ఈ తోపులాటలో కృష్ణ, కార్పొరేటర్ గులిగిందల లావణ్య కిందపడిపోవడంతో గాయాలయ్యాయి. వెంటనే వారిని గాజువాక సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్నారు.

కల్వర్టులో శుభ్రతకు ఎమ్మెల్యే వెలగపూడి ఆదేశం


కల్వర్టు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వెంకోజీపాలెం సమీపంలో నార్త్‌స్టార్ అపార్టుమెంట్స్ ఎదురుగా జాతీయ రహదారి కింది భాగంలో ఉన్న కల్వర్టును శుభ్రం చేయాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆ ప్రాంతాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. దీంతో స్థానికులు కొందరు రహదారి కింది భాగంలో ఉన్న కల్వర్టులో వర్షం నీరు నిలిచిపోతోందని, దీనివల్ల కొండవాలు వైపు నీరు నిలిచిపోయి, జాతీయ రహదారి ముంపునకు గురవుతోందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ఈ సమస్య చాలా కాలంగా ఉన్నా, జీవీఎంసీ అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదన్నారు.

తాజాగా.. కొత్త యంత్రాలు వచ్చాయని అధికారులు చెబుతున్నారని, వాటితో కల్వర్టులో చెత్తాచెదారం తొలగించే ప్రక్రియ చేపట్టాలని కోరారు.

దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెలగపూడి.. కల్వర్టు నుంచి జాతీయ రహదారిని ఆనుకుని హనుమంతువాక నుంచి ఉన్న పెద్ద గెడ్డలోకి నీటి ప్రవాహం ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ సిబ్బందికి సూచించారు.

ద్విచక్ర వాహనం చోరీపై కేసు నమోదు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలో అధికంగా ద్విచక్రవాహనాల నుంచి పెట్రోలు చోరీ చేసే కేసులు ఎక్కువగా ఉంటాయి. చెడు వ్యసనాలకు అలవాటు పడిన యువత తాము వాడే వాహనాల కోసం పెట్రోల్ చోరీ చేస్తుంటారు. తాజాగా ఓ ద్విచక్ర వాహనం కూడా చోరీకి గురవడం ఈ ప్రాంతీయులకు ఆందోళనకు గురిచేస్తోంది. ఎంవీపీ కాలనీ రెండో సెక్టరు డీఎల్‌ఎక్స్ హాస్టల్ వద్ద పార్కు చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. వాహన యజమాని చంద్రశేఖర్ రాపిడో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. తన బైక్ గత నెల 23న చోరీకి గురైనప్పటికీ, నగరంలోని వివిధ ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లేకపోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. నేర విభాగం ఎస్ఐ రవికుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

దక్షిణాది రాష్ట్రాల టీటీ పోటీలు ప్రారంభం


గీతం కళాశాలలో పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

సాగర్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయూ) ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా దక్షిణ మండల (సౌత్‌జోన్) అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల టేబుల్‌టెన్నిస్ (టి.టి) పోటీలు మంగళవారం గీతంలో ప్రారంభ మయ్యాయి. ఈ పోటీలలో దక్షిణ భారత దేశంలోని 84 విశ్వవిద్యాలయాల నుంచి 400 మంది క్రీడాకారిణులు పాల్గొన్నారు. గీతం క్యాంపస్ లైఫ్ అసోసియేట్ డీన్ అరుణ్‌కార్తిక్, గీతం సెక్యూరిటీ విభాగం అధిపతి కె.మధు, సీనియర్ అధికారి హేమంత్‌బగ్గా, గీతం క్రీడావిభాగం డిప్యూటీ డైరక్టర్ ఎన్.శ్రీనివాస్, గీతం క్రీడా విభాగం సీనియర్ మేనేజర్ కె.తపస్వి హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. పోటీలలో కర్ణాటక నుంచి 28 జట్లు, తమిళనాడు నుంచి 22 జట్లు, ఆంధ్రప్రదేశ్ నుంచి 18 జట్లు, తెలంగాణ, కేరళ నుంచి 7 జట్లు చొప్పున, పాండిచ్చేరి నుంచి 2 జట్లు పాల్గొన్నాయి. ఈనెల 11 వరకు నాకౌట్ పద్ధతిలో జరిగే పోటీలలో విజేతలను తెలంగాణలోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగే ఫైనల్ పోటీలకు ఎంపిక చేస్తారు. విశాఖపట్నం టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ సాంకేతిక సహకారంతో ఏఐయూ నిబంధనలకు అనుగుణంగా పోటీలు నిర్వహిస్తున్నారు.

జేఎన్‌టీయూ జట్టుపై గీతం జట్టు విజయం: మొదటి రోజు జరిగిన పోటీలలో ఆతిథ్య గీతం మహిళా జట్టు జేఎన్‌టీయూ జట్టుపై 3-0తో విజయం సాధించింది. అలాగే మరో 15 జట్లు 3-0 స్కోరుతో విజయం సాధించాయి. గీతం క్రీడాకారిణులు పి.హాసిని, మోహితగాయత్రీ, అనన్యపాండే, బి.హాసిని ఉత్తమ ప్రతిభను కనబరిచారు. జట్టు కోచ్‌గా దినేష్‌కుమార్ వ్యవహరించారు.

సినిమా గైడ్

● **ఆంధ్రా కింగ్ తాలూకా** : శరత్, మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య (గాజువాక), ఎస్.వి.సి. లిఖిత (శ్రీహరిపురం),

● **ప్రేమంటే** : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.సి. గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).

● **12ఎ రైల్వే కాలనీ** : లీలామహల్, రామ, నటరాజ్ (పెందుర్తి). మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతా రామయ్య (పరవాడ),

● **రాజు వెడ్స్ రాంబాయి / మఫ్టీపోలీసు** : జగదాంబ

● **శిసు / రాజు వెడ్స్ రాంబాయి** : శారదా

● **పాంచ్‌మినార్ / ఇట్లు మీ ఎదవ** : రమాదేవి

● **ది గర్ల ఫ్రండ్** : శ్రీకన్య, కిన్నెర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 37, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 44, గుత్తి/రవి వంకాయలు 34, బెండకాయలు 58, పచ్చిమిర్చి 42, బజ్జి పకోడి మిర్చి 58, కాకరకాయలు 48, బీరకాయలు 46, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 22, క్యారెట్ 40, దొండకాయలు 32, బంగాళ దుంపలు 18, కాప్సికమ్ 64, అరటికాయ (పె) 7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 64, బరబాటి 42, పోటల్స్ 54, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 40, బద్ద చిక్కుడు 44, దోస కాయలు 22, పోటల్స్ 54, వెల్లుల్లి (పెద్దవి) 64, కొబ్బరికాయ (పెద్దది) 35, బీట్‌రూట్ 44, బీన్స్ (పెన్సిల్) 60, కీరదోస 22, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 26, చిలగడ దుంపలు 32, కంద దుంప 50, దేముడు చిక్కుడు 54, గ్రీన్‌పీస్ బటాని 100, గోరు చిక్కుడు 48, కూర పెండలం 38, పనస పొట్టు 200, కొండఉసిరి 52, కరివేపాకు (కిలో) 66, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 32, మామిడి అల్లం 64, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	640
విజయనగరం	644
శ్రీకాకుళం	644

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

సచివాలయ మహిళా పోలీసుల సేవలు వినియోగించుకుంటాం

» సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వార్డు సచివాలయాల్లో మహిళా పోలీసుల సేవలకు ఆకాశమే హద్దు అని సీపీ శంఖబ్రతబాగ్చి అన్నారు. వారితో మంగళవారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. కొంతమంది మహిళా పోలీస్‌లు విధి నిర్వహణపై సందేహాలు నివృత్తి చేయాలని కోరడంతో డీజీపీ కార్యాలయాన్ని సంప్రదించి జీవీఎంసీ అధికారులతో కలిసి 430 మందితో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. మహిళా పోలీసులతో కంప్యూటర్ డేటా ఎంట్రీ, ఈ-కాప్స్, సీడీఫైల్స్ రాయడం, సైబర్ నేరాలు, మహిళలు, పిల్లలపై జరిగే నేరాలపై అవగాహన, స్టేషన్‌లో రిసెప్షన్, రికార్డులు అప్‌డేట్, కౌన్సెలింగ్, సమాచార సేకరణ, సమన్లు అందజేయడం, లోక్ అదాలత్, ఫిర్యాదులపై తీసుకున్న చర్యలు గురించి సమాధానం ఇవ్వడం వంటి పది రకాల విధుల్లో సహాయం తీసుకోవచ్చునని గుర్తించామన్నారు. కార్యక్రమంలో డీసీపీ-1 మణికంఠ చందోలు, జీవీఎంసీ యూసీడీ పీడీ సత్యవేణి, జోన్-3 కమిషనర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవేంకటేశ్వర వైభవం

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరు భద్రం కమ్యూనిటీ హాలులో బుధవారం నుంచి శ్రీ వేంకటేశ్వర వైభవం నిర్వహించనున్నారు. మంగళవారం సాయంత్రం ఎంవీపీ వీధుల్లో భక్తుల గోవింద నామస్మరణతో శోభాయాత్ర నిర్వహించారు. రుషిపీఠం ఆధ్వర్యంలో 10, 11, 12, 13 తేదీల్లో ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ సుప్రభాత సేవ, తోమాల సేవ, తిరువీధి ఉత్సవం, సహస్ర దీపాలంకరణ, నాద నీరాజనం, ఏకాంత సేవ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కందాళ అరుణగాయత్రి తెలిపారు. ప్రతి రోజూ సాయంత్రం శ్రీవేంకటేశ్వర వైభవంపై ప్రముఖ ఆధ్యాత్మికవేత డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ ప్రవచనం ఉంటుందని, అందరూ ఆహ్వానితులేనని అరుణ గాయత్రి పేర్కొన్నారు.

'వైద్యవిద్య ప్రైవేటుపరం నిర్ణయాన్ని వాపసు తీసుకోవాలి'


సేకరించిన కోటి సంతకాల పత్రాలతో వైసీపీ నేతలు

వెంకోజీపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిరంకుశ వైఖరితో వ్యవహరిస్తూ, ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటుపరం చేసి పేద విద్యార్థులకు వైద్యవిద్య పేద ప్రజలకు ఉచిత వైద్యం దూరం చేసే విధంగా నిర్ణయం తీసుకుందని వైసీపీ తూర్పు నియోజకవర్గం కన్వీనర్ మొల్లి అప్పారావు విమర్శించారు. మంగళవారం ఎంఎంటీసీ కాలనీలోని వైసీపీ తూర్పు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోటి సంతకాలను సేకరించామని, ఆ పత్రాలను రాష్ట్ర గవర్నర్‌కు అందజేసి, ప్రభుత్వం నిర్ణయాన్ని రద్దు చేసే విధంగా చూడాలని కోరుతామన్నారు. ఈ ఏడాది అక్టోబరు 10 నుంచి ప్రారంభించిన సంతకాల సేకరణ కార్యక్రమంలో పార్టీ తూర్పు నియోజకవర్గ పరిశీలనలో, తాను నియోజకవర్గంలోని అన్ని వార్డులలో సంతకాలను సేకరించామన్నారు.

విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థులు, ప్రజల వద్ద మద్దతుతో 83,269 సంతకాలను 60 రోజుల పాటు సేకరించామని, ఈ పత్రాలను బుధవారం నియోజకవర్గ కార్యాలయం నుంచి బయలుదేరి ఊరేగింపుగా వెళ్లి, పార్టీ జిల్లా కార్యాలయంలో సమర్పించి, తద్వారా గవర్నర్‌కు చేరుస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో నాయకులు నడింపల్లి కృష్ణంరాజు, చొల్లంగి నాగేశ్వరరావు, పేర్ల విజయ్‌చందర్, కార్పొరేటర్లు మువ్వల లక్ష్మి, అక్కరమాని రోహిణి తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో జెన్ జీ థీమ్ పోస్టాఫీస్ ప్రారంభం


వీసీ రాజశేఖర్‌కు పోస్టాఫీసు సేవల గురించి వివరిస్తున్న తపాలా శాఖ అధికారులు

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రాంగణంలో అత్యాధునికంగా జెన్ జీ థీమ్‌తో పోస్ట్ ఆఫీస్ సేవలను వైస్ చాన్సలర్ జీపీ రాజశేఖర్ ప్రారంభించారు. మంగళవారం ఉదయం వర్సిటీలో ఉన్న పోస్టాఫీస్‌లో ఈ సేవలను ప్రారంభించిన అనంతరం వీసీ మాట్లాడుతూ.. యువతరం ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఇందులో అన్ని సౌకర్యాలను కల్పించారన్నారు. జెన్ జీ పోస్టాఫీస్ ఆధునిక సాంకేతికతను సంప్రదాయ పోస్టల్ సేవలతో అనుసంధానం చేశారన్నారు. డిజిటల్, స్నేహపూర్వక కౌంటర్లు, వేగవంతమైన పార్శిల్ సేవలు, విద్యార్థి-కేంద్రీకృత పరిష్కారాలతో పాటు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించనున్నారన్నారు.

ఏపీలోనే మొట్టమొదటి జెన్ జీ పోస్టాఫీస్‌ను వర్సిటీలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పోస్టుమాస్టర్ జనరల్ వీఎస్ జయశంకర్ మాట్లాడుతూ పోస్టాఫీస్ ఆవిష్కరణ, ప్రాముఖ్యత, నిబద్ధతను వివరించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో శిశువు మృతి

» వైద్యుల నిర్లక్ష్యమే కారణమని తల్లిదండ్రుల ఆరోపణ

» ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, కలెక్టర్, కేజీహెచ్ సూపరింటెండెంట్‌లకు ఫిర్యాదు


ఉమాదేవి

మహారాణిపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యం కారణంగా తమ బిడ్డ మృతి చెందిందని ఆరోపించిన దంపతులు...న్యాయం జరిగేంత వరకూ కేజీహెచ్‌ను విడిచి వెళ్లేది లేదని స్పష్టంచేశారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, కలెక్టర్, ఆసుపత్రి సూపరింటెండెంట్‌లకు ఫిర్యాదులు పంపారు. ఈ ఘటనకు సంబంధించి ఫిర్యాదుదారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సింహాచలం ప్రాంతానికి చెందిన పట్నాల ఉమాదేవి (27), సూర్య దంపతులకు ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహమైంది. ఆమె గర్భం దాల్చడంతో గోపాలపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందింది. ఈ నెల ఒకటో తేదీ నాటికి ప్రసవం కావలసి ఉంది. అయితే ఆ తేదీ దాటిపోయినా, డెలివరీ కాకపోవడంతో అక్కడ ఆసుపత్రి వైద్యులు కేజీహెచ్‌కు వెళ్లాలని రిఫర్ చేశారు.

ఈ నెల రెండో తేదీ ఉదయం 11 గంటలకు ఉమా దేవి కేజీహెచ్‌లో చేరింది. వైద్యులు సహజ ప్రసవం కోసం యత్నించారు. సాయంత్రం 5.30 గంటలకు ఆమెను సహజ ప్రసవ వార్డు లోకి తీసుకువెళ్లారు. శిశువు తల బయటకు రాకపోయినా బలవంతంగా తీయడానికి యత్నించారు. ఒక డాక్టర్ ఉమాదేవి బెడ్ మీదకు ఎక్కి ఆమె తలను రెండు కాళ్ల మధ్యలో అదిమి పెట్టి పొట్టపై నొక్కారు. నొప్పి తట్టుకోలేక అరిస్తే తనను కొట్టారని ఉమాదేవి ఆరోపించింది. ఆ సమయంలో ఊపిరి అందకపోవడంతో ఆక్సిజన్ పెట్టారని పేర్కొంది. అంతవరకు శిశువు హార్ట్ బీట్ బాగానే ఉందని చెప్పిన వైద్యులు..కొద్దిసేపటి తరువాత కదలికలు తెలియడం లేదన్నారని పేర్కొంది. ఉమాదేవి సంతకం తీసుకొని సాయంత్రం 6.19 గంటలకు సర్జరీ చేసి శిశువును బయటకు తీశారు. వెంటనే చూపించకుండా రాత్రి 7 గంటల సమయంలో బిడ్డ చనిపోయిందని చెప్పారని, పసికందు మృతదేహాన్ని సైతం మరుసటిరోజు ఉదయం 10 గంటలకు ఇచ్చారని బావురుమంది. కేవలం వైద్యుల తీరు, హింసించిన విధానం వల్లే శిశువు తమకు దక్కలేదని, ఇలాంటి వైద్యులను వైద్య వృత్తి నుంచి తొలగించాలని డిమాండ్ చేసింది. ఉమాదేవిని ఈ నెల 4న డిశ్చార్జి చేయాలని ఆసుపత్రి వైద్యులు ప్రయత్నించగా తమకు న్యాయం జరిగే వరకు బయటకు వెళ్లబోమని స్పష్టం చేశామన్నారు.

కలెక్టర్‌కు నివేదిక పంపాం

ఈ ఘటనపై ముగ్గురు గైనకాలజిస్టులు, ముగ్గురు శిశువైద్యులతో కమిటీ వేసి విచారణ జరిపించినట్లు కేజీహెచ్ సూపరింటెండెంట్ ఐ.వాణి వివరణిచ్చారు. కమిటీ ఇచ్చిన నివేదికను కలెక్టర్‌కు పంపామనిఆమె పేర్కొన్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

సీతంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో ఓ మహిళ మృతిచెందింది. ఈ సంఘటన మంగళవారం అక్కయ్యపాలెంలో జరిగింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అక్కయ్యపాలేనికి చెందిన పి.రత్నాకర్‌రావు, జయశ్రీ (63) దంపతులు. వీరిద్దరు మంగళవారం ద్విచక్రవాహనంపై నగంలోకి వెళ్లారు. తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో శాంతిపురం సిగ్నిల్ పాయింట్ వద్ద వెనుకనుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో బైక్ వెనుక కూర్చున్న జయశ్రీ రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతిచెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి ట్రాఫిక్ ఎస్ఐ వాణిశ్రీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిర్మాణంలో ఉండగానే కూలిన ఏఎస్‌ఎన్ మాల్ శ్లాబ్

యజమాన్యానికి నోటీసు జారీచేసిన ఏపీఐఐసీ

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పక్కన కంచరపాలెం పోలీస్ స్టేషన్ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఏఎస్‌ఎన్ సిటీ సెంటర్‌మాల్ శ్లాబ్ రెండు రోజుల క్రితం (ఆదివారం) కూలిపోయింది. ఆ నిర్మాణానికి అనుమతులు జారీచేసిన ఏపీఐఐసీ అధికారులు స్పందించి శ్లాబ్ కూలిపోవడానికి గల కారణాలు తెలపాలని ఆదేశిస్తూ నోటీసు జారీచేశారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గ్రీన్ బెల్ట్‌ను ఆక్రమించి ఏఎస్‌ఎన్ మాల్ నిర్మాణం చేపట్టడంతో ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు అభ్యంతరం తెలపడంతోపాటు గ్రీన్‌బెల్ట్ ఆక్రమణపై జీవీఎంసీ అధికారులకు సైతం ఫిర్యాదు చేశారు. దీంతో జీవీఎంసీ అధికారులు స్పందించి గ్రీన్‌బెల్ట్‌లో ఆక్రమణలను తొలగించి ఫెన్సింగ్ వేయించారు. గ్రీన్‌బెల్ట్‌లో మొక్కలు నాటారు. గ్రీన్‌బెల్ట్‌లో ఇప్పటికీ కొన్ని షెడ్‌లు, ఇతర పరికరాలు ఉన్నాసరే జీవీఎంసీ అధికారులు చూసీచూడనట్టు వదిలేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ తరుణంలో నిర్మాణంలో ఉన్న ఏఎస్‌ఎన్ మాల్ రెండు రోజుల కిందట అకస్మాత్తుగా కూలిపోయింది. శ్లాబ్ కూలిపోయిన విషయమై ఏపీఐఐసీ మేనేజర్ లోహకుమార్ వద్ద ప్రస్తావించగా, తమకు సమాచారం తెలియగానే ఆ సంస్థ యాజమాన్యానికి నోటీసులు జారీచేశామని వివరించారు. వారి నుంచి సమాధానం వచ్చిన తర్వాత తదుపరి ఏం చేయాలనే దానిపై ఆలోచిస్తామన్నారు.


కూలిపోయిన ఏఎస్‌ఎన్ మాల్ శ్లాబ్

బోధనాస్పత్రుల సెక్యూరిటీ సిబ్బందికి వేధింపులు

- సిబ్బందిని ఆకస్మికంగా నిలిపేస్తున్న కొత్త ఏజెన్సీ సంస్థ
- అరకొర వేతనాల చెల్లింపుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర వైద్య కళాశాల పరిధిలోని బోధనాస్పత్రుల్లో సెక్యూరిటీ బాధ్యతలు చూస్తున్న కాంట్రాక్ట్ సంస్థ శ్రీ కార్తికేయ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. కొన్నేళ్లుగా పనిచేస్తున్న సిబ్బందిని వేధిస్తూ తస్మదీయులను విధుల్లో నుంచి తొలగించేందుకు సిద్ధమవుతోంది. ఈ అంశం సెక్యూరిటీ సిబ్బందిని మానసిక వేదనకు గురిచేస్తోంది. కొత్తగా బాధ్యతలు చేపట్టిన శ్రీ కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థ మునుపెన్నడూ లేని విధంగా వ్యవహరిస్తోందని పలువురు సెక్యూరిటీ సిబ్బంది వాపోతున్నారు. సరైన కారణాలు చెప్పకుండా ఎంతో మందిని విధులకు రావద్దంటున్నారని, దీనిపై ప్రశ్నిస్తుంటే కాంట్రాక్టర్‌కు చెప్పుకోవాలని కొందరు ఉద్యోగులు చెబుతున్నారు. కాంట్రాక్టర్ ఎవరన్న దానిపై ఇప్పటికీ సెక్యూరిటీ సిబ్బందికి కూడా స్పష్టత లేదు. కొద్దిరోజుల కిందటి వరకు ఒకరు కాంట్రాక్టర్‌గా చెప్పుకుంటూ తిరిగారు. ఆయన్ను కొద్దిరోజుల కిందట మరో జిల్లాలో అరెస్ట్ చేశారు. ఆ తరువాత మరో ఇద్దరు కాంట్రాక్టర్ తరపు న ఈ బాధ్యతలు చూస్తామంటూ వచ్చారు. వారే ఇప్పుడు ఆస్పత్రిలో పనిచేసే కొందరు సెక్యూరిటీ సిబ్బందిని వేధిస్తున్నారు. డ్యూటీ వేయడం, షిఫ్ట్‌ల మార్పిడి వంటి వ్యవహారాల్లో నచ్చిన వారికి ఒక విధంగా, నచ్చని వారి పట్ల మరో విధంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వీటిపై ప్రశ్నిస్తున్న సెక్యూరిటీ సిబ్బందిని విధులకు రావద్దంటూ హెచ్చరిస్తున్నారు. 10, 12 ఏళ్ల నుంచి పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బందికే ఈ తరహా వేధింపులు ఉంటే.. మిగిలిన వారి పరిస్థితి అర్థం చేసుకోవచ్చని పలువురు పేర్కొంటున్నారు. అలాగే, ప్రాంతీయ కంటి ఆస్పత్రిలో పనిచేసే మరో మహిళా సెక్యూరిటీ ఉద్యోగినిని వేధిస్తుండడం గమనార్హం.

భారీగా సిబ్బంది..

ఆంధ్ర వైద్య కళాశాల పరిధిలో సుమారు 500 మంది వరకు సెక్యూరిటీ సిబ్బంది పని చేస్తున్నారు. కేజీహెచ్‌లో సుమారు 280 మంది, ఈఎన్‌టీలో 20 నుంచి 30 మంది, చాతి, అంటువ్యాధుల ఆస్పత్రిలో 35 నుంచి 40 మంది, మెంటల్ ఆస్పత్రిలో 25 మంది, విమ్స్‌లో 100 మంది, ఘోష ఆస్పత్రిలో 40 మంది, ఆర్‌సీడీలో 15 మంది వరకు సెక్యూరిటీ సిబ్బంది పని చేస్తున్నారు. అయితే, వీరికి చెల్లించే వేతనం అరకొరగానే ఉంటోందని పలువురు వాపోతున్నారు. ప్రస్తుతం సెక్యూరిటీ గార్డుకు నెలకు ఈ సంస్థ రూ.12,090, సూపర్ వైజర్‌కు రూ.13,880 చెల్లిస్తోంది. అయితే, ప్రభుత్వం సదరు సంస్థకు మాత్రం గార్డుకు రూ.18 వేలకుపైగా, సూపర్ వైజర్‌కు రూ.21 వేలకుపైగా చెల్లిస్తోంది. కానీ, సదరు సంస్థ మాత్రం వారికి పూర్తిస్థాయిలో వేతనాలు చెల్లించడం లేదు. దీనిపై కొందరు కలెక్టరేట్‌లోను, ఆస్పత్రి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకు రెండు నెలలకు సంబంధించిన జీతాలను సదరు సంస్థ సిబ్బందికి చెల్లించలేదు. సెప్టెంబరు నెలకు సంబంధించిన వేతనాలను మాత్రమే చెల్లించింది. ఇంకా అక్టోబరు, నవంబరు నెలల వేతనాలు చెల్లించాల్సి ఉంది. ఇచ్చే అరకొర జీతాలను సకాలంలో చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సిబ్బంది వాపోతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

రైల్వే ఆసుపత్రిలో మహిళలకు క్యాన్సర్ ఉచిత స్క్రీనింగ్



కార్యక్రమాన్ని ప్రారంభించిన డీఆర్‌ఎం లలిత్ బొహ్రా తదితరులు

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే ప్రధాన ఆసుపత్రిలో మహిళలకు క్యాన్సర్ ఉచిత స్క్రీనింగ్, అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. మెడికోవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌తో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమానికి డీఆర్‌ఎం లలిత్ బొహ్రా, వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు జ్యోత్స్న బొహ్రా ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. డీఆర్‌ఎం మాట్లాడుతూ మహిళా ఉద్యోగులకు ఆరోగ్య రక్షణపై అవగాహన ఉండాలని, సరైన పోషకాహారంతో ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని, కుటుంబ శ్రేయస్సుకు ప్రాధాన్యతనిచ్చి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికోవర్ హాస్పటల్స్ ప్రాంతీయ డైరక్టర్ డాక్టర్ నిమ్మగడ్డ పద్మజ, ఏడీఆర్‌ఎం కె.రామారావు, రైల్వే ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శరత్‌బాబు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకుడు డాక్టర్ కె.ఎస్.శాస్త్రి

అక్కయ్యపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మాస్టర్ హోమియో వైద్యాలయం ద్వారా యాభై సంవత్సరాలుగా నిస్వార్థంగా అందించిన సేవలు నిరుపమానమని, తన జీవితాన్ని సమాజసేవకు అంకితం చేసిన మహానుభావుడని జగద్గురుపీఠం జాతీయ సలహా మండలి సభ్యుడు సీ.హెచ్.ఎస్.ఎస్.రాజు కొనియాడారు. అక్కయ్యపాలెం గల మాస్టర్ హోమియో వైద్యాలయ ప్రాంగణంలో 'ది వరల్డ్ టీచర్ ట్రస్ట్' (జగద్గురు పీఠం) నిర్వహించిన డాక్టర్ కె.ఎస్.శాస్త్రి సంస్మరణ సభలో ఆయన ప్రసంగించారు. మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య ఆచరించిన ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలను డాక్టర్ శాస్త్రి ఒక తపస్సుగా నిర్వహించారని పలువురు కొనియాడారు. అనంతరం శాస్త్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆంధ్రుల చరిత్రకు ఆద్యుడు మల్లంపల్లి సోమశేఖర్ శర్మ



ప్రాచీన ఆంధ్ర లిపి పుట్టుపూర్వోత్తరాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సోమసుందరరావు

సీతంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్‌లోని బీవీకే కళాశాలలో మల్లంపల్లి సోమశేఖర్ శర్మ చారిత్రక అధ్యయన సంస్థ, కళాశాల సంయుక్త నిర్వహణలో సోమశేఖర్ శర్మ జయంతి కార్యక్రమం, రచయిత డాక్టర్ బెల్లంకొండ రమేష్ చంద్ర రాసిన 'ప్రాచీన ఆంధ్ర లిపి పుట్టుపూర్వోత్తరాలు' అనే పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ బెల్లంకొండ రమేష్ చంద్ర మాట్లాడుతూ ఆంధ్రులకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చింది ప్రఖ్యాత చరిత్రకారుడు మల్లంపల్లి సోమశేఖర్ శర్మ అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆంధ్ర విశ్వవిద్యాలయం చరిత్ర విభాగం విశ్రాంత ఆచార్యులు ఆచార్య కొల్లూరు సూర్యనారాయణ మాట్లాడుతూ ఆంధ్రుల చరిత్రకు శాశ్వత చిరునామాగా సోమశేఖర్ శర్మ నిలిచారన్నారు. ప్రఖ్యాత శాసన పరిశోధకుడు, ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు ఆచార్య సి.సోమసుందరరావు మాట్లాడుతూ చరిత్ర, సాహిత్య రంగాల్లో శర్మ గొప్ప కృషి చేశారని, ఆయనకు శిష్యుడుగా ఉండడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'ప్రాచీన ఆంధ్ర లిపి పుట్టుపూర్వోత్తరాలు' పుస్తకాన్ని సోమసుందరరావు ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని కృష్ణ ప్రభుత్వ కళాశాల చరిత్ర అధ్యాపకులు డాక్టర్ ఎ.ఎల్.రూపవాణి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో బీవీకే కళాశాల ప్రిన్సిపాల్ పి.రత్నశేఖర్, కార్యదర్శి శంకర్ నీలు భాగవతుల, చరిత్ర అధ్యాపకులు భరత్ ప్రశాంత, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంతాల్లో పరిశీలన

కంచరపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 48వ వార్డు పరిధి కొండవాలు ప్రాంతాల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు బీజేపీ నాయకుడు గంకల అప్పారావు పేర్కొన్నారు. కొండవాలు ప్రాంతాల్లో మంగళవారం పర్యటించిన అప్పారావు పలు సమస్యలను గుర్తించారు. డ్రైన్లు, కాలువలు, రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను కోరారు.



పోటీల ప్రారంభ సూచికగా బెలూన్లు ఎగురవేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యేలు వెలగపూడి, గణబాబు, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తదితరులు

జాతీయ రోలర్ స్కేటింగ్ టోర్నీ ప్రారంభం

విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వుడా పార్కు రింక్‌లో జరుగుతున్న 63వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ టోర్నీ మంగళవారం అధికారికంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పశ్చిమ శాసనసభ్యుడు గణబాబు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, శాప్ చైర్మన్ రవినాయుడు, భారత రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి భగీరథ్, రాష్ట్ర సంఘం అధ్యక్షుడు సుధాకరరెడ్డి తదితరులు పాల్గొని వుడా పార్కు రింక్‌లో ఈవెంట్లను ప్రారంభించి స్కేటర్లను అభినందించారు.

డౌన్‌హిల్ ఈవెంట్‌లో తమిళనాడు ఆధిక్యత

తొట్లకొండ వద్ద జరిగిన డౌన్ హిల్ ఈవెంట్‌లో తమిళనాడు స్కేటర్లు ఆధిపత్యం ప్రదర్శించారు. ఆసక్తికరంగా సాగిన డౌన్‌హిల్ ఈవెంట్‌లో స్కేటర్లు గాయాల బారిన పడకుండా ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ ఈవెంట్‌లో పురుషుల, మహిళల విభాగాలలో తమిళనాడు స్కేటర్లు పతకాల పంట పండించగా, ఆతిథ్య ఆంధ్ర రెండు పతకాలు సాధించింది.

విజేతలు: 18 ప్లస్ పురుషుల విభాగంలో కిషోర్ కృష్ణ (తమిళనాడు), హర్షిత్ (తమిళనాడు), సయాంత్ (కేరళ)...మహిళల కేటగిరీలో వర్షిణి (తమిళనాడు), అమిజదిని (తమిళనాడు), వి.ఆర్.రమ్యశ్రీ (ఆంధ్ర); 15-18 ఏళ్ల బాలుర విభాగంలో గురుహర్షన్ (తమిళనాడు), వాష్టవ్ లీమన్ (కేరళ), అరవ్ శ్రీజిత్ (తమిళనాడు)...బాలికల కేటగిరీలో శృతి (తమిళనాడు), అక్షర (తమిళనాడు), ఐశ్వర్య (ఆంధ్ర) ఉన్నారు.

బీజేపీ కార్యాలయంలో ప్రజాదర్బార్



దరఖాస్తుదారుతో మాట్లాడుతున్న ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో గల బీజేపీ ఉత్తర నియోజకవర్గం కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ప్రజావేదిక, ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. నియోజకవర్గంలో పలు ప్రాంతాల ప్రజలు విభిన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు సమర్పించారు. ముఖ్యమంత్రి సహాయనిధికి సంబంధించి 2, ప్రజా పనుల విభాగంలో పెండింగ్‌లో ఉన్న అంశాలు, పారిశుధ్య సమస్యలు, విద్యుత్ శాఖపై ఫిర్యాదులు, టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించిన సమస్య, వ్యక్తిగత, ప్రజాప్రయోజన సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి రావడంతో సంబంధిత శాఖల అధికారులతో నేరుగా మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రాము, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, స్వర్ణాంధ్ర స్టాఫ్ సభ్యులు అక్షయ, పాండ, చైతన్య, దివ్య, రామకృష్ణ, కూటమి నాయకులు ఈతలపాక సుజాత, వరప్రసాద్, శంకరరావు, గొంప ధర్మారావు, బాలకృష్ణ, బంగారు రాజు, వీరబాబు, దుర్గారావు, వార్డు అధ్యక్షులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ముఖ్యమంత్రి సహాయ నిధిగా మంజూరైన రూ.4,74,486 చెక్కులను ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు బాధితులకు మంగళవారం అందచేశారు. 24, 25, 26, 44, 45, 46, 50 వార్డులకు చెందిన పలువురికి వీటిని అందచేశారు. ఈ నెల 13న లయన్స్ క్యాన్సర్ ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినందున ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు కేజీహెచ్‌కి వెళ్లాలని, అక్కడ అనుభవజ్ఞులైన వైద్యులు సేవలందిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గ ప్రజల్లో ఎవరికైనా తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే తన కార్యాలయం దృష్టికి తీసుకురావాలని కోరారు. లయన్స్ క్యాన్సర్ ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్ట్ చైర్మన్ ఉమామహేశ్వరరావు, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, శ్యామల దీపిక పాల్గొన్నారు.

బార్ కౌన్సిల్‌లో మహిళలకు 30 శాతం రిజర్వేషన్ హర్షణీయం

- మహిళా న్యాయవాదుల ఆనందం



సమావేశంలో మాట్లాడుతున్న వావా అధ్యక్షురాలు అనురాధ పప్పు తదితరులు

సీతంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జరగనున్న ఆల్ ఇండియా బార్ కౌన్సిల్ ఎన్నికలలో మహిళా ప్రాతినిధ్యాన్ని పెంచి ప్రతి రాష్ట్రంలోనూ మహిళా న్యాయవాదులకు 30 శాతం రిజర్వేషన్ కల్పించడం హర్షణీయమని వుమెన్ అడ్వొకేట్ వెల్ఫేర్ అసోసియేషన్ (వావా) అధ్యక్షురాలు అనురాధ పప్పు పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు ఇచ్చిందని, జనవరి, ఫిబ్రవరి-2026లో జరిగే రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలలో మహిళా న్యాయవాదులకు 30 శాతం రిజర్వేషన్ కల్పించడం ఆనందం కలిగించిందన్నారు. మహిళలు పోటీపడాలంటే చాలా వ్యయ ప్రయాసలకు లోనయ్యేవారని, రాష్ట్రానికి ఒకరిద్దరు మహిళా న్యాయవాదులు గెలవడం చాలా కష్టంగా ఉండేదన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని, మహిళా న్యాయవాదులకు 33 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కోరుతూ కోర్టులో దావా వేశామన్నారు. దీంతో చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్యా బాగ్చితో కూడిన ధర్మాసనం మహిళా న్యాయవాదులకు స్టేట్ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో 20 శాతం, మహిళల పోటీపై, కో-ఆప్షన్ విధానంపై మరో 10 శాతం రిజర్వేషన్ ఇస్తూ చరిత్రాత్మక తీర్పు ఇచ్చిందన్నారు. ఈ తీర్పు రావడానికి కృషి చేసినవారందరికీ వావా అభినందనలు తెలుపుతోందన్నారు. వావా ఉపాధ్యక్షురాలు పి.హేమలత, కోశాధికారి కె.లక్ష్మి దుర్గానాగశ్రీ, బి.రమాదేవి, డి.సుకన్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాలోత్సవం



ఫోక్ సాంగ్ కేటగిరీలో మొదటి బహుమతి పొందిన విశాఖ వ్యాలీ పాఠశాల బృందం

మహారాణిపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సెయింట్ ఆంథోనీ పాఠశాలలో విశాఖ బాలోత్సవాన్ని మంగళవారం ఘనంగా ప్రారంభించారు. మహారాణిపేటలోని సెయింట్ ఆంథోనీ పాఠశాల ఆవరణలో రోటరీక్లబ్, విశాఖ వ్యాలీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన బాలోత్సవాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్‌కుమార్ ప్రారంభించారు. ఈ నెల 11 వరకు నిర్వహించే కార్యక్రమంలో పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీసేలా జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ స్థాయి అకాడమిక్ ఈవెంట్స్, కల్చరల్ ఈవెంట్స్ నాటికలు, వ్యాసరచన, స్పెల్‌బీ, దేశభక్తి గీతాలు తదితర పోటీలను పాఠశాలల మధ్య నిర్వహిస్తారు. నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. గ్రూప్ ఫోక్ సాంగ్ కేటగిరీలో విశాఖ వ్యాలీ పాఠశాలకు చెందిన ఇషిత అండ్ టీమ్ మొదటి బహుమతి గెలుచుకుంది. ఈ కార్యక్రమంలో సెయింట్ ఆంథోనీ ఫాదర్ రత్నకుమార్, డా.పీకే జోష్, డా.. వై.కల్యాణ చక్రవర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



ప్రజల అర్జీలు పరిశీలిస్తున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ

డాబాగార్డెన్స్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని దక్షిణ ఎమ్మెల్యే సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. మంళవారం జీవీఎంసీ పరిధి 31వ వార్డులో విజన్ యూనిట్ యాక్షన్ ప్లాన్ కార్యాలయంలో వివిధ వార్డుల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేసి వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

గీత వృత్తిదారుల అభ్యున్నతికి కృషి: వంశీకృష్ణ

మహారాణిపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రానున్న కార్పొరేషన్ ఎన్నికలలో గీత వృత్తి సామాజిక వర్గీయులకు రెండు కార్పొరేటర్ సీట్లు, దేవాలయాలలో బోర్డు సభ్యులుగా అవకాశాలు కల్పించనున్నట్లు జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, దక్షిణ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం గీత వృత్తిదారుల సంఘం పెద్దలు వంశీకృష్ణ శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారితో ఎమ్మెల్యే మాట్లాడుతూ గీత వృత్తిదారుల సామాజిక, రాజకీయ, ఆర్థికాభివృద్ధికి సహకరిస్తానన్నారు. జనవరి 4న జరగనున్న వనసమారాధనకు ఎమ్మెల్యేను ఆహ్వానించారు. సంఘం నాయకులు అప్పారి గిరి, పిల్లి నూకరాజు, కట్టా మల్లేశ్వరరావు, అంగటి శ్రావణకుమార్, కండిపిల్లి శ్రీధర్, అంగటి రాము, సిమ్మా గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 12 కేంద్రాల్లో టెట్

మహారాణిపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బుధవారం (నేటి) నుంచి ఈ నెల 21 వరకు జిల్లాలోని 12 కేంద్రాలలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో పరీక్ష నిర్వహణ అధికారులతో సమావేశమయ్యారు. విశాఖ జిల్లాలో 11, అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో ఒక కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులతో కలసి మొత్తం 26,248 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు. రెండు పూటలా నిర్వహించే పరీక్ష సజావుగా జరిగేలా అధికారులు సహకరించాలని డీఈవో కోరారు. తమ కార్యాలయంలో ప్రత్యేక డెస్కు ఏర్పాటు చేశామని, అధికారులు లేదా అభ్యర్థులు సహాయం కోసం 91772 92969, 96185 84051, 83285 24861 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

31వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా నవీన్‌కుమార్

డాబాగార్డెన్స్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే తన లక్ష్యమని 31వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బత్తిన నవీన్‌కుమార్ అన్నారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ తన సేవలను గుర్తించి పార్టీ వార్డు అధ్యక్షుడిగా నియమించిన విశాఖ ఎంపీ శ్రీభరత్, దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్‌లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజల్లో నిత్యం అందుబాటులోకి ఉండి సేవలందిస్తానన్నారు.

ఘనంగా ఆంధ్ర వైద్య కళాశాల క్రీడా పోటీలు

- ఓవరాల్ చాంప్ 2021 బ్యాచ్
- వ్యక్తిగత చాంప్ కిరణ్‌కుమార్, సంజన



ఓవరాల్ చాంపియన్ అథ్లెట్లకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర వైద్య కళాశాల క్రీడా దినోత్సవం ఘనంగా ముగిసింది. వివిధ క్రీడాంశాలలో నిర్వహించిన పోటీల్లో వైద్య విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను నిరూపించుకున్నారు. ఈ పోటీల్లో 2021 బ్యాచ్ విద్యార్థులు ఓవరాల్ చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకోగా...ఓవరాల్ అథ్లెటిక్స్‌లో కూడా 2021 విద్యార్థులు 83 పాయింట్లతో చాంపియన్ టైటిల్‌ను సొంతం చేసుకున్నారు. అథ్లెటిక్స్ పురుషుల విభాగంలో బి.కిరణ్‌కుమార్ (2021 బ్యాచ్), మహిళల కేటగిరీలో బి.సంజన (2022 బ్యాచ్) వ్యక్తిగత చాంపియన్ అవార్డులు అందుకున్నారు. క్రీడా దినోత్సవ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్, అదనపు డీఎంఈ డాక్టర్ కేవీఎస్ఎం.సంధ్యాదేవి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందజేసి అభినందించారు. ప్రత్యేక అతిథులుగా కిమ్స్ ఐకాన్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ పి.సతీష్‌కుమార్ హాజరుకాగా, వైద్య కళాశాల సూపరింటెండెంట్, అదనపు డీఎంఈ (కేజీహెచ్) డాక్టర్ ఐ.వాణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.కృష్ణవేణి, డాక్టర్ వి.మన్మథరావు, స్పోర్ట్స్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్.సునీల్‌కుమార్, ఫిజికల్ డైరక్టర్ డాక్టర్ ఎంఎంఎస్.పాత్రుడు, స్పోర్ట్స్ కార్యదర్శి ఎస్.భానుసతీష్, ఐ.శ్యామల పాల్గొన్నారు.

అప్పన్న ఆలయంలో తిరుమంజన సేవ



ప్రాంగణాన్ని శుభ్రపరుస్తున్న దృశ్యం

సింహాచలం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన ధనుర్మాసోత్సవాల ప్రారంభ సూచికగా అప్పన్న ఆలయంలో 'కోయిల్ ఆళ్వార్ తిరుమంజన' సేవ చేపట్టారు. దానిలో భాగంగా అధికారులు ముందుగా ప్రకటించిన విధంగా సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో భక్తులకు స్వామివారి దర్శనాలు నిలుపుదల చేశారు. దేవాలయ ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో అప్పన్న ఆలయాన్ని ఆమూలాగ్రం తొలుత చీపుర్లతో శుభ్రపరిచారు. అనంతరం గంగధార నుంచి పైప్‌లైన్ ద్వారా తరలించిన పవిత్ర జలాలతో దేవాలయం అంతటినీ పారిశుధ్య సిబ్బంది, దేవాలయ అధికారులు కలిసి శుభ్రపరిచారు. తరువాత ఆలయాన్ని రంగవల్లులతో తీర్చిదిద్ది తిరిగి సాయంత్రం 4 గంటల సమయంలో భక్తులకు స్వామివారి దర్శనాలు కల్పించారు. తిరుమంజన సేవలో దేవాలయ ఏఈఓ కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షణాధికారి బి.సత్యశ్రీనివాస్ పాల్గొన్నారు.

విమ్స్‌లో ఔషధ నియంత్రణ విభాగం కార్యాలయం, ల్యాబ్

... 5వ పేజీ తరువాయి

మద్దిల రామలక్ష్మి, 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, నాయకులు బుడమూరు గోవింద్, తదితరులు పాల్గొన్నారు. ఔషధ నియంత్రణ మండలి డైరెక్టర్ ఎం.పాండురంగారావు వర్చువల్‌గా పాల్గొని మాట్లాడారు.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీల సమయంలో అనుమానం వచ్చి సేకరించిన నమూనాలను ఔషధ నియంత్రణ విభాగంలో పరీక్షిస్తారు. టాబ్లెట్స్, దగ్గు మందులు, ఇతర ఔషధాలను పరీక్షిస్తారు.

14న వైజాగ్ నేవీ మారథాన్

... 5వ పేజీ తరువాయి

నేవీ థీమ్ మెడల్, గూడీ బ్యాగ్, అల్పాహారం అందజేస్తారన్నారు. ప్రజలకు శారీరక దృఢత్వం, సముద్ర వ్యవహారాలపై అవగాహన పెంచడమే దీని ఉద్దేశమన్నారు. దీనికి ముందు ఆయన నేవీ, జిల్లా అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో నేవీ కెప్టెన్లు టీఆర్ఎస్ కుమార్, వినోత్ తివారీ, కమాండర్ కిశోర్, లెఫ్టినెంట్ కమాండర్లు పి.మోహంత్ నాయుడు, నరేశ్, ఏడీసీ రమణమూర్తి, ఈపీడీసీఎల్ ఎస్ఈ శ్యాంబాబు పాల్గొన్నారు.

రాంబిల్లిలో సోలార్ కంపెనీ

... 5వ పేజీ తరువాయి

పేర్కొంది. దీంతో పాటు రెండు గిగావాట్ల హైడ్రో స్టోరేజీ ప్రాజెక్టు, 300 కేటీపీఏ సామర్థ్యంతో గ్రీన్ అమ్మోనియా ప్లాంటు, ఐదు గిగావాట్ల హైబ్రిడ్ రెన్యువబుల్ ప్రాజెక్టులు (విండ్, సోలార్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్) ఏర్పాటుచేస్తుంది. వీటన్నింటికీ కలిపి రూ.82 వేల కోట్లు పెట్టుబడి పెడతామని ఇటీవల జరిగిన సీఐఐ పెట్టుబడిదారుల సదస్సులో ఒప్పందం చేసిందని తెలిసింది. వీటిని నడపడానికి రోజుకు 95 మెగావాట్ల నిరంతర విద్యుత్, రోజుకు పది మిలియన్ లీటర్ల నీరు అవసరమని, అందుకు తగిన ఏర్పాట్లుచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.

నేరెళ్లవలసలో అక్రమంగా మట్టి తవ్వకాలు

... 5వ పేజీ తరువాయి

నేరెళ్లవలస సర్వే నంబరు 4లో కొండ పోరంబోకు స్థలంలో తవ్వుతున్నారు. ఇప్పటివరకూ సుమారుగా 280 లారీల మట్టిని తీసుకువెళ్లినట్టు స్థానికులు చెబుతున్నారు. సోమవారం రాత్రి స్థానిక జనసేన నాయకులు మట్టి లారీలను అడ్డుకుంటే దళారులు రంగ ప్రవేశం చేసి బెదిరింపులకు దిగారు. జనసేన పార్టీలో పెద్దలతో చెప్పి మంచి పదవి ఇప్పిస్తామని, లారీల జోలికి రావద్దని హెచ్చరించారు. ఈ సొసైటీ సభ్యులు కొన్ని దశాబ్దాలుగా తమ భూమి కోసం న్యాయపోరాటం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచే తాము భూమిని తీసుకున్నామని వారు మొర పెట్టుకున్నా ఎర్రమట్టి దిబ్బలు కలిగిన ప్రాంతం కావడంతో త్వరగా అనుమతులు రావడం లేదు. ఆ పనులన్నీ తాము చేసి పెడతామంటూ దళారులు రంగంలో దిగి పబ్బం గడుపుకొంటున్నారు. ఈ మట్టి తవ్వకాలపై మైనింగ్, రెవెన్యూ శాఖలు దృష్టి పెట్టి, తక్షణమే అడ్డుకట్ట వేయాల్సి ఉంది.

శతాబ్ది ఉత్సవాల వేళ... అభివృద్ధి మేళా

... 5వ పేజీ తరువాయి

అత్యాధునిక భవనాన్ని నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఇంకా 24 వేల చదరపు అడుగుల్లో సెంట్రలైజ్డ్ కిచెన్, భోజనశాల నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. కేంద్ర పరిశోధన కేంద్రం నిర్మించనున్నారు. ఇందులో అత్యాధునిక పరిశోధన పరికరాలను ఏర్పాటు చేయనున్నారు. వర్సిటీ వందేళ్ల పూర్తి చేసుకుంటున్న తరుణంలో కీలకమైన ప్రాజెక్టులను చేపట్టాలన్న ఉద్దేశంతో ప్రణాళికలు రూపొందించామని రిజిస్ట్రార్ రాంబాబు తెలిపారు. ఆయా ప్రాజెక్టులకు సంబంధించిన ప్రతిపాదనలు ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపించామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించాయన్నారు. రానున్న 50 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టులను చేపడుతున్నట్టు ఆయన తెలిపారు.

అద్దెకు స్టీల్ ప్లాంటు క్వార్టర్లు

... 5వ పేజీ తరువాయి

నిర్వహణ లేకపోవడంతో పాముల నిలయాలుగా మారాయి. పొదలు పెరిగిపోయాయి. టౌన్‌షిప్‌కు ఓ మూలగా సెక్టార్-12లో సి, డి-టైప్ క్వార్టర్లు ఉన్నతాధికారుల కోసం నిర్మించారు. 1,300 చ.అ. విస్తీర్ణంలో 3 బెడ్‌రూమ్స్ ఉంటాయి. వీటిని ఇప్పుడు హెచ్‌పీసీఎల్ ఉద్యోగులకు అద్దెకు ఇవ్వాలని యాజమాన్యం నిర్ణయించింది. దీనిపై హెచ్‌పీసీఎల్ యాజమాన్యం వారి ఉద్యోగులకు లేఖలు పంపుతోంది. ఆ క్వార్టర్లను తీసుకోవడానికి ఎవరికైనా ఆసక్తి ఉంటే సమాధానం ఇవ్వాలని, దాని ప్రకారం స్టీల్ ప్లాంటుతో ఒప్పందం చేసుకుంటామని చెబుతోంది. ఇలా డి-టైప్ క్వార్టర్లలో ఓ 20 వరకు అద్దెకు ఇవ్వడానికి అనువుగా ఉన్నాయి. వాటి ద్వారా మహా వస్తే నెలకు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల అద్దె వస్తుంది. ఆ ఆదాయం కోసం మరో సంస్థకు అద్దెకు ఇవ్వాల్సిన అవసరం ఉందా?...అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

ఎవరూ చేరకపోవడం వల్లనే

ఇటీవల ఉద్యోగులు అందరికీ బలవంతంగా క్వార్టర్లు కేటాయిస్తున్నారు. అయినా చాలామంది ఈ సి, డి క్వార్టర్లు తీసుకోవడానికి ముందుకురావడం లేదు. ఖాళీగా ఉంటే పాడైపోతాయని, ఎంతో కొంత ఆదాయం వస్తుందనే ఆలోచనతోనే ఈ ప్రతిపాదన చేశామని ప్లాంటు యాజమాన్యం చెబుతోంది.

13న ఏయూ పూర్వ విద్యార్థుల సమావేశం

... 5వ పేజీ తరువాయి

వ్యవస్థాపక అధ్యక్షులు గ్రంధి మల్లికార్జునరావు, తదితరులు పాల్గొంటారన్నారు. ఇప్పటివరకూ పది వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, రెండు వేల మందికిపైగా హాజరవుతారన్నారు. ప్రధాన వేదికతోపాటు ప్రాంగణం వెలుపల ప్రత్యేక స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ 13వ తేదీ మధ్యాహ్నం ఏయూ పరిపాలనా భవనం వద్ద ఉన్న వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహానికి ముఖ్య అతిథి పూలమాల వేసి నివాళులు అర్పిస్తారన్నారు. వార్షిక పూర్వ విద్యార్థుల సమావేశానికి వర్సిటీపరంగా సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ప్రపంచవ్యాప్తంగా స్థిరపడిన ఏయూ పూర్వ విద్యార్థులను అనుసంధానిస్తామని, విశ్వవిద్యాలయ అభివృద్ధిలో వారిని భాగస్వామ్యులను చేస్తామని చెప్పారు. విశ్వవిద్యాలయం భవిష్యత్తు ప్రణాళికలను వారికి వివరించే ప్రయత్నం చేస్తామన్నారు. శతాబ్ది ఉత్సవాల్లో పూర్వ విద్యార్థులను భాగస్వామ్యులను చేస్తామన్నారు.

డిసెంబర్ 13వ తేదీ ఉదయం ప్రతి విభాగంలో పూర్వ విద్యార్థులతో ఆత్మీయ సమ్మేళనాలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనం వేవ్స్-2025 కార్యక్రమ వివరాలతో కూడిన పోస్టర్‌ను వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ అలూమ్ని చైర్మన్ కేవీవీ రావుతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు డాక్టర్ కె.కుమార్‌రాజ, జనరల్ సెక్రెటరీ ఆకుల చంద్రశేఖర్, ఈసీ సభ్యులు డాక్టర్ ఎస్‌కేఈ అప్పారావు, ప్రొఫెసర్ బి.మోహనవెంకటరామ్, వైవీ అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

హరిత విప్లవానికి పునాది

» కోరమాండల్ ఎరువుల కర్మాగారానికి 58 ఏళ్లు
» నేడు వ్యవస్థాపక దినోత్సవం



కోరమాండల్ ఎరువుల కర్మాగారం

మల్కాపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశంలో హరిత విప్లవానికి పునాది వేసింది విశాఖపట్నం కోరమాండల్ ఎరువు కర్మాగారం. రాష్ట్రంలో పంటలు సక్రమం గా పండకపోవడం, పండిన పంటకు పురుగుపట్టేయడం తో రైతులు తీవ్ర నష్టాలు చవిచూసేవారు. ఈ కష్టాలకు బ్రేక్‌వేయాలనే ఆలోచన నుంచి తొలి ఎరువుల కంపెనీని 1967 డిసెంబరు పదో తేదీన శ్రీహరిపురంలో నిర్మించారు. 58 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో కంపెనీ అనేక విజయాలను సొంతం చేసుకుని దూసుకువెళ్తోంది. యునైటెడ్ స్టేట్స్ కంపెనీ ఐఎంసీ, చెరవెన్ కెమికల్ కంపెనీ, ఈఐడీ ప్యాక్టరీ సహకారంతో 1961లో శ్రీహరిపురంలో 500 ఎకరాల స్థలంలో కాంప్లెక్స్ ఫెర్టిలైజర్స్‌ను ప్రారంభించారు. మురుగప్ప గ్రూప్ అనుబంధ మురుగప్ప గ్రూప్ ఈఐడీ ప్యాక్టరీలో మెజారిటీ వాటాలను కొనుగోలు చేసింది. ఈ క్రమంలో 1967న కోరమాండల్ పేరుతో పూర్తిస్థాయి కంపెనీని ప్రారంభించింది. కాగా 2009 సెప్టెంబరు 25న కంపెనీ కోరమాండల్ ఇంటర్‌నేషనల్‌గా పేరు మార్చారు. కంపెనీ ఏడాదికి సుమారు 12 లక్షల టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, ఫాస్పారిక్ యాసిడ్, సల్ఫ్యూరిక్ యాసిడ్ ఉత్పత్తి సామర్థ్యంతో నడుస్తోంది. కాగా పరిశ్రమను అనకాపల్లికి చెందిన రైతు గ్రంధి రామ్మూర్తిశెట్టి తో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అప్పటి ఉపప్రధా ని మొరార్జీ దేశాయ్, రాష్ట్ర ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి హాజరయ్యారు. ఎన్నో విజయాలను నమోదుచేసిన కంపెనీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని డ్రోన్‌ల ద్వారా ఎరువులు చల్లేందుకు శ్రీకారం చుట్టి, ఇందులో యువతకు శిక్షణ ఇస్తోంది. ఎకరా పొలంలో ఎరువు చల్లాలంటే రైతుకు రోజుల సమయం పట్టేది. అదే డ్రోన్ ద్వారా చల్లితే నిమిషాల వ్యవధిలోనే పూర్తవుతుంది.

ఆహార పొట్లాల పంపిణీ

అగనంపూడి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి సత్రం జంక్షన్‌లో మంగళవారం బొర్రమాంబ పారాయణ సమితి ఆధ్వర్యంలో అనాథలు, యాచకులు, వృద్ధులకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. సంస్థ సేవా కార్యక్రమంలో భాగంగా దాతల సాయంతో ప్రతి వారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సేవా సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల మధ్య తోపులాట

» 58వ వార్డు కార్పొరేటర్, పార్టీ వార్డు అధ్యక్షుడికి గాయాలు

మల్కాపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మింది గ్రామంలోని ఉన్న మళ్ల విజయప్రసాద్ స్టూడియోలో మంగళవారం వైసీపీ కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశం ముగిసిన అనంతరం 58వ వార్డుకు చెందిన వైసీపీ నాయకుడు వంగ శ్రీనుకు, వైసీపీ వార్డు అధ్యక్షుడు గులిగిందల కృష్ణకు ఓ విషయంపై మాటామాటా పెరిగి తోపులాటకు దారి తీసింది. ఈ తోపులాటలో కృష్ణ, కార్పొరేటర్ గులిగిందల లావణ్య కిందపడిపోవడంతో గాయాలైయాయి. వెంటనే వారిని గాజువాక సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు

లారీ ఢీకొని మహిళ మృతి

సీతంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో ఓ మహిళ మృతిచెందింది. ఈ సంఘటన మంగళవారం అక్కయ్యపాలెంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అక్కయ్యపాలేనికి చెందిన పి.రత్నాకర్‌రావు, జయశ్రీ (63) దంపతులు. వీరిద్దరు మంగళవారం ద్విచక్రవాహనంపై నగంలోకి వెళ్లారు. తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో శాంతిపురం సిగ్నల్ పాయింట్ వద్ద వెనుకనుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో బైక్ వెనుక కూర్చున్న జయశ్రీ రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతిచెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి ట్రాఫిక్ ఎస్ఐ వాణిశ్రీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హక్కులు ఎంతో అవసరం

» జిల్లా నోడల్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి

మల్కాపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆహారం, నీరు, విద్య, స్వేచ్ఛ, అభివృద్ధి, న్యాయం, భద్రత, ఆత్మగౌరవం వంటివి పొందాలంటే మానవ హక్కులు ఎంతో అవసరమని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి అన్నారు. సెయింట్ ఆన్స్ కళాశాలలోని జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహించిన మానవహక్కుల సదస్సులో ఆమె మాట్లాడుతూ మానవ హక్కుల వల్ల ప్రజాస్వామ్యం విజయం సాధిస్తుందని అన్నారు. సమాజంలో అసమానత్వం, అసమర్థత, వివక్ష, పేదరికం మొదలైన అంశాలు మానవహక్కులకు అడ్డంకులుగా ఉన్నాయని జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయాదేవీ అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ఆంధ్రా కింగ్ తాలూకా** : శరత్, మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య (గాజువాక), ఎస్.వి.సి. లిఖిత (శ్రీహరిపురం),
- **ప్రేమంటే** : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.సి. గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).
- **12ఎ రైల్వే కాలని** : లీలామహల్, రామ, నటరాజ్ (పెందుర్తి). మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ),
- **కాంత** :
- **రాజు వెడ్స్ రాంబాయి / మఫ్టీపోలీసు** : జగదాంబ
- **శిసు / రాజు వెడ్స్ రాంబాయి** : శారదా
- **పాంచ్‌మినార్ / ఇట్లు మీ ఎదవ** : రమాదేవి
- **ది గర్ల్ ఫ్రండ్** :శ్రీకన్య కిన్నెర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 37, వంకాయలు(తెలుపు) 40, వంకాయలు (నలుపు) 44, గుత్తి/రవి వంకాయలు 28, బెండకాయలు 54,పచ్చిమిర్చి 42, బజ్జి పకోడి మిర్చి 58, కాకరకాయలు 48, బీరకాయలు 46, ఆనపకాయ 24,కాలీఫ్లవర్ 36, క్యాబేజి 23, క్యారెట్40, దొండకాయలు 32, బంగాళ దుంపలు 17, కాప్సికమ్ 64, అరటికాయ (పె) 7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 64, బరబాటి 42, పోటల్స్ 54, ముల్లంగి 30,నిమ్మకాయలు (కిలో) 40, బద్ద చిక్కుడు 44, దోస కాయలు 22, పోటల్స్ 54, వెల్లుల్లి (పెద్దవి) 64, కొబ్బరికాయ (పెద్దది) 35, బీట్‌రూట్ 38, బీన్స్ (పెన్సిల్) 60, కీరదోస 22, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 26, చిలగడదుంపలు 26, కంద50, దేముడుచిక్కుడు 56, గ్రీన్‌పీస్ బటాని 76, గోరుచిక్కుడు 48, కూరపెండలం 38, పనసపొట్టు 200, కొండఉసిరి 52, కరివేపాకు (కిలో) 66, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 80, బూడిదగుమ్మడికాయ 20, కర్రపెండలం 32, మామిడి అల్లం 64, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	640
విజయనగరం	644
శ్రీకాకుళం	644

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

తిరుమల సన్నిధిలో ఎమ్మెల్యే పంచకర్ల


కుటుంబ సభ్యులతో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మంగళవారం తిరుమల వెంకటేశ్వ రుడిని కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. విశాఖ ప్రజ లు సుఖ సంతోషాలతో ఉండాలని, రాష్ట్ర అన్ని రంగాల్లో అభి వృద్ధి సాధించాలని మొక్కినట్టు ఎమ్మెల్యే తెలిపారు. పీపీఏ ఎస్ చైర్మన్ ఆయితి సింహాచలం, రాజా సుధాకర్ ముదు నూరి పంచకర్ల వెంట ఉన్నారు.

'కూటమి పాలనలోనే రాష్ట్రానికి మేలు'

మల్కాపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యో తి): కూటమి పాలనలో రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతోందని, ముఖ్యంగా విశాఖకు గూగుల్ డేటా సెంటర్‌ను తీసుకురావడానికి ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కలిదండి బద్రీనాథ్ అన్నారు. ఎమ్మెల్యే వంశీ కృష్ణను బద్రీనాథ్ బృందం మంగళవారం కలిసి ఆయన్ను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మళ్లీమళ్లీ కూటమి పాలనలోనే రాష్ట్రం ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సర్కిల్-3 ఏఎస్‌వో సస్పెన్షన్

గాజువాక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గాజువాక సర్కిల్-3 ఏఎస్‌వో టి.కృష్ణను సస్పెండ్ చేస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత బుధవారం లంచం తీసుకుంటూ ఏఎస్‌వో టి.కృష్ణ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కృష్ణను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సర్కిల్-1 ఏఎస్‌వోగా విధులు నిర్వహిస్తున్న శ్రీహరికు సర్కిల్-3 ఏఎస్‌వోగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

బొర్రమాంబకు పూజలు

అగనంపూడి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి ఉక్కునిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత బొర్రమాంబ ఆలయంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

» పెదగంట్యాడ ఎంఈవో కె.రమణాజి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈవో రమణాజి

పెదగంట్యాడ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని పెదగంట్యాడ ఎంఈవో కె.రమణాజి అన్నారు. 'బాల్యవివాహ ముక్త' భారత్ వందరోజుల కార్యక్రమంలో భాగంగా మహిళా అభివృద్ధి శిశుసంక్షేమ శాఖ గంగవరం జడ్పీ ఉన్నతపాఠశాల ప్లస్ 2 ఆవరణలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలిసీ తెలియని వయస్సులో బాలికలకు వివాహాలు చేయడం ద్వారా వారి జీవితాలు నాశనం కావడంతో పాటు వారికి ఆరోగ్యసమస్యలు వచ్చే ప్రమాదం ఉన్నదని తెలిపారు. బాలికలను రక్షించుకోవడం, వారి హక్కులను కాపాడుకోవడం అందరి బాధ్యత అన్నారు. అనంతరం ఉమెన్స్ హెల్ప్‌లైన్ నంబరు 181, చైల్డ్ హెల్ప్ లైన్ నంబరు 1098, పోక్సోచట్టం వంటి వాటి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అగనంపూడిలో..

అగనంపూడి: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రజలు సహకరించాలని ఐసీడీఎస్ సీడీపీవో నీలవేణి పిలుపునిచ్చారు. బాల్య వివాహ ముక్త భారత్ వంద రోజుల కార్యచరణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పినమడక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆడ పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించి ఉన్నత చదువులు చదివించాలన్నారు. చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం ఆమె విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ చెల్లాయమ్మ, హెచ్‌ఎం బ్రహ్మానందం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం


87వ వార్డులో పార్కును శుభ్రం చేస్తున్న దృశ్యం

కూర్మన్నపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత వల్ల ఆరోగ్య సమస్యలు దరిచేరవని తిరుమల నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.విశ్వేశ్వరరావు, ఎం.పరమానందం అన్నారు. 87వ వార్డు తిరుమల నగర్ కాలనీలో పార్కుల్లో మంగళవారం సచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంకుడు గుంతలు, పార్కులు, ఓపెన్‌జిమ్ తదితర ప్రాంతాల్లో చెత్తా చెదారం, పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి మహిళ ఎంతో బాధ్యతతో ఇంటి పరిసరాల్లో చెత్తా చెదారాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కాలుష్య నివారణలో మొక్కలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ వారి ఇంటి వద్ద మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఆర్కేబీచ్‌లో..

అగనంపూడి: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాటు పడాలని విజ్ఞాన్ ఎన్‌ఎస్‌ఎస్ అధికారి పి.సన్యాసిరావు అన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమంలో భాగంగా ఆర్కే బీచ్‌లో ఎంబీఏ విద్యార్థులు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు బీచ్ ప్రాంగణంలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. పరిశుభ్రత పాటించాలని సందర్శకులకు అవగాహన కల్పించారు.

కేజీహెచ్‌లో శిశువు మృతి

» వైద్యుల నిర్లక్ష్యమే కారణమని తల్లిదండ్రుల ఆరోపణ
» ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, కలెక్టర్, కేజీహెచ్ సూపరింటెండెంట్‌లకు ఫిర్యాదు


ఉమాదేవి

మహారాణిపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర క్ష్యం కారణంగా తమ బిడ్డ మృతి చెందిందని ఆరోపించిన దంపతులు...న్యాయం జరిగేంత వరకూ కేజీహెచ్‌ను విడిచి వెళ్లేది లేదని స్పష్టంచేశారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, కలెక్టర్, ఆసుపత్రి సూపరింటెండెంట్‌లకు ఫిర్యాదులు పంపారు. ఈ ఘటనకు సంబంధించి ఫిర్యాదుదారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సిం హాచలం ప్రాంతానికి చెందిన పట్నాల ఉమా దేవి (27), సూర్య దంపతులకు ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహమైంది. ఆమె గర్భం దాల్చడంతో గోపాలపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందింది. ఈ నెల ఒకటో తేదీ నాటికి ప్రసవం కావలసి ఉంది. అయితే ఆ తేదీ దాటిపోయినా, డెలివరీ కాకపోవడంతో అక్కడ ఆసుపత్రి వైద్యులు కేజీహెచ్‌కు వెళ్లా లని రిఫర్ చేశారు. ఈ నెల రెండో తేదీ ఉద యం 11 గంటలకు ఉమాదేవి కేజీహెచ్‌లో చేరి ంది. వైద్యులు సహజ ప్రసవం కోసం యత్నించారు. సాయంత్రం 5.30 గంటలకు ఆమెను సహజ ప్రసవ వార్డులోకి తీసుకువెళ్లారు. శిశువు తల బయటకు రాకపోయినా బలవంతంగా తీయడానికి యత్నించారు. ఒక డాక్టర్ ఉమాదేవి బెడ్ మీదకు ఎక్కి ఆమె తలను రెండు కాళ్ల మధ్యలో అదిమి పెట్టి పొట్టపై నొక్కారు. నొప్పి తట్టుకోలేక అరిస్తే తనను కొట్టారని ఉమాదేవి ఆరోపించింది. ఆ సమయంలో ఊపిరి అందకపోవడంతో ఆక్సిజన్ పెట్టారని పేర్కొంది. అంతవరకు శిశువు హార్ట్ బీట్ బాగానే ఉందని చెప్పిన వైద్యులు...కొద్దిసేపటి తరువాత కదలికలు తెలియడం లేదన్నారని పేర్కొంది. ఉమాదేవి సంతకం తీసుకొని సాయంత్రం 6.19 గంటలకు సర్జరీ చేసి శిశువును బయటకు తీశారు. వెంటనే చూపించకుండా రాత్రి 7 గంటల సమయంలో బిడ్డ చనిపోయిందని చెప్పారని, పసికందు మృతదేహాన్ని సైతం మరుసటిరోజు ఉదయం 10 గంటలకు ఇచ్చారని బావురుమంది. కేవలం వైద్యుల తీరు, హింసించిన విధానం వల్లే శిశువు తమకు దక్కలేదని, ఇలాంటి వైద్యులను వైద్య వృత్తి నుంచి తొలగించాలని డిమాండ్ చేసింది.

ఉమాదేవిని ఈ నెల 4న డిశ్చార్జి చేయాలని ఆసుపత్రి వైద్యులు ప్రయత్నించగా తమకు న్యాయం జరిగే వరకు బయటకు వెళ్లబోమని స్పష్టంచేశామన్నారు.

కలెక్టర్‌కు నివేదిక పంపాం: ఈ ఘటనపై ముగ్గురు గైనకాలజిస్టులు, ముగ్గురు శిశువైద్యులతో కమిటీ వేసి విచారణ జరిపించినట్లు కేజీహెచ్ సూపరింటెండెంట్ ఐ.వాణి వివరించారు. కమిటీ ఇచ్చిన నివేదికను కలెక్టర్‌కు పంపామని ఆమె పేర్కొన్నారు.

వైద్యరంగాన్ని ప్రైవేటీకరణ చేయడం అన్యాయం

మాజీ ఎమ్మెల్యేలు మళ్ల విజయప్రసాద్, చింతలపూడి వెంకటరామయ్య

మల్కాపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగాన్ని ప్రైవేటుపరం చేయడం అత్యంత దారుణమని, కూటమి ప్రభుత్వం పాలన అధ్వానంగా ఉన్నదని మాజీ ఎమ్మెల్యేలు మళ్ల విజయప్రసాద్, చింతలపూడి వెంకటరామయ్య అన్నారు. వైద్య రంగం ప్రైవేటీకరణను నిరసిస్తూ సేకరించిన సంతకాల పత్రాలను పశ్చిమ నియోజకవర్గం నాయకులకు పారిశ్రామిక ప్రాంతం ఏడువార్డుల నాయకులు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

రాష్ట్రంలో తీవ్ర వ్యతిరేకత వస్తోంది

అక్కిరెడ్డిపాలెం: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోందని, వైసీపీ కోటి సంతకాల సేకరణ విజయవంతమే దానికి నిదర్శనమని వైసీపీ పశ్చిమ నియోజకవర్గం పరిశీలకుడు చింతలపూడి వెంకటరామయ్య అన్నారు. 68 వార్డు రాంనగర్‌లో మంగళవారం జరిగిని పశ్చిమ నియోజకవర్గం నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక చర్యలపై ప్రజలను చైతన్యం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

16 నుంచి 'ఉక్కు'లో ధనుర్మాస ఉత్సవాలు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ వెంకటేశ్వర ఆలయంలో ఈనెల 16వ తేదీ నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించనున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా గోత్రనామార్చన, గోదాదేవికి సుప్రభాతసేవ, ఆరాధన, తిరుప్పావై, అర్చన, మంగళశాసనం, పాశురవిన్నపం వంటి కార్యక్రమాలు ఈ నెల పాటు చేస్తామని తెలిపారు. డిసెంబరు 30న ముక్కోటి ఏకాదశి సందర్భంగ ఉదయం నుంచి భక్తులకు ఉత్తర ద్వారం దర్శనం కల్పించనున్నామని పేర్కొన్నారు. వచ్చే నెల 5వ తేదీన తిరువీధి రథోత్సవం, 9 నుంచి 13వ తేదీ వరకు గోదాదేవికి అభిషేకం, తోమాలసేవ, 11న కూడారై ఉత్సవం 14న గోదాదేవి కల్యాణ ఉత్సవం నిర్వహించనున్నామని తెలిపారు.

'ప్రాబ్లమ్ సాల్వింగ్ ఫిట్'పై విద్యార్థులకు అవగాహన

అగనంపూడి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అల్గోజెనిత్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రాబ్లమ్ సాల్వింగ్ ఫిట్ అనే అంశంపై విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ప్రముఖ సాఫ్ట్‌వేర్ డెవలపర్ జానకిరాముడు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లో వచ్చే సమస్యలను ఏ విధంగా పరిష్కరించాలో తెలయజేశారు. అనంతరం విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం జానకిరాముడును విజ్ఞాన్ యాజమాన్యం సత్కరించింది.

'వ్యాధులు రాకుండా చూసుకోవాలి'

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వ్యాధులు రాకుండా పలు ఆరోగ్య నియమాలను పాటించడం ఎంతో ఉత్తమమని 'లీ' ఫార్మా కంపెనీ డైరెక్టర్ లీలా రాణి అన్నారు. నాతయ్యపాలెంలో సాయి శర్వాణి పాఠశాలలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ బి.చంద్రమౌళీ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలమని అన్నారు. ఈ శిబిరంలో సుమారు 160 మందికి వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

నూతన సౌకర్యం కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

వేపగుంట డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వేపగుంట జోన్ 8 కార్యాలయం పరిధిలోని పెందుర్తి నియోజకవర్గంలో మరో రెండు సౌకర్యం కేంద్రాలు ఏర్పాటుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా పెందుర్తి నియోజకవర్గం పరిధిలో పన్నులు చెల్లింపునకు ప్రజలకు చేరువలో ఉండేలా రెండు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి అధికారులు యత్నాలు ముమ్మరం చేశారు. దీనిలో భాగంగా పెందుర్తి జంక్షన్ ప్రాంతంలో, సుజాతనగర్‌లో కేంద్రాలు ఏర్పాటు చేయడానికి జడ్సీ హెచ్.శంకరరావు, ఈఈ దిలీప్, డీఈ ప్రవీణ్ తదితరులు స్థలాలను పరిశీలించారు. ఈ నెలాఖరుకు స్థలాలు ఖరారు చేసేందుకు ఇంజనీరింగ్ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా పెందుర్తి, సుజాతనగర్‌లో నిర్మాణాలు, జన నివాసాలు అధికంగా ఉండడంతో ఆయా ప్రాంతాలో ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులు ప్రయత్నిస్తున్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు ప్రారంభం

మల్కాపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం సెయింట్ జోసఫ్ పాఠశాలలో క్రిస్మస్ సంబరాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఫాదర్ జీవన్‌బాబు, మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు, ఎస్సై శ్రీనివాసరావు, జనసేన నాయకుడు చంద్రమౌళీ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సెయింట్ జోసఫ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేయాలి

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అంజేయాలని, వారికి సేవ చేయాలని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక జోనల్ కార్యాలయంలో మంగళవారం సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ గాజువాక నియోజకవర్గంలో బంగారు కుటుంబాలను గుర్తించి, వారికి అందించాల్సిన ప్రయోజనాలను పారదర్శకంగా అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శేషాద్రి, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో పిచ్చి మొక్కల తొలగింపు

గాజువాక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 72వ వార్డు చినగంట్యాడ ఎంపీపీ పాఠశాల ఆవరణలో మంగళవారం పిచ్చి మొక్కల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాలలో పిచ్చి మొక్కలు బాగా పెరిగిపోవడంతో స్పందించిన టీడీపీ వార్డు అధ్యక్షుడు అక్కిన లక్ష్మణరావు ఈ విషయాన్ని జీవీఎంసీ అధికారులు, స్థానిక సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన అధికారులు స్కూల్ ప్రాంగణాన్ని పరిశుభ్రం చేశారు.

కాంట్రాక్టు కార్మికుల సంక్షేమానికి కృషి

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉక్కు కాంట్రాక్టు కార్మికుల సంక్షేమానికి ఎంతో కృషి చేశానని కాంట్రాక్టర్ రమేశ్ అన్నారు. స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కాంట్రాక్టు కార్మికులతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంట్‌లో పలు విభాగాల్లో కాంట్రాక్టర్‌గా చేసినప్పటికీ కార్మికుల సంక్షేమానికి కృషి చేశానన్నారు. ఇటీవల కాలంలో కాంట్రాక్టు కార్మికులను తొలగించడం చాలా బాధగా ఉందన్నారు. కార్మికులకు ఏ అవసరం వచ్చానా అండగా నిలుస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మిక నాయకులు పాల్గొన్నారు.

4న గీత సహకులాల వన సమారాధన


వన సమారాధన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గీత కార్మికులు

భీమునిపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విశాఖ పార్లమెంటు పరిధి గీత సహకులాల వన సమారాధన భారీ ఎత్తున జనవరి 4న నిర్వహించనున్నట్టు గీత సహకులాల సమైక్య అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం పట్టణంలోని నేరెళ్లవలస కాలనీలో టీడీపీ నాయకులు చిట్టిబోయిన రాము అధ్యక్షతన గీత సహకులాల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీనివాసరావు మాట్లాడుతూ నగరంలోని ముడసర్లోవ పార్కులో ఈ వన సమారాధన నిర్వహించడానికి ఏర్పాట్లు చేసున్నట్టు చెప్పారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సామాజిక, రాజకీయ, ఆర్థికంగా వెనుకబడి ఉన్న తమ కులాలు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సందర్భంగా ప్రభుత్వ దృష్టికి తీసుకువెళనున్నందున అత్యధిక సంఖ్యలో గీత సహకులాల వారు వన సమారాధనకు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. ఏపీ యాత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, తెలుగుదేశం బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి అంగటి రాము మాట్లాడుతూ ఈ వన సమారాధనకు భీమిలి నియోజకవర్గం నుంచి అత్యధిక సంఖ్యలో గీత సహకులాలవారు తరలిరావాలని కోరారు. సమావేశంలో శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ అనుసూరి మధుసూదన్, యాత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బాడితబోయిన రాములప్పడు, నాయకులు బుత్తల నర్సింగరావు, రీసు రమణ, కాకర ఎల్లారావు, చెల్లుబోయిన గోవింద తదితరులు పాల్గొన్నారు.

మహిళా పోలీసుల సేవలు వినియోగించుకుంటాం

» సీపీ శంఖబ్రతబాగ్చి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రతబాగ్చి

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):పోలీస్‌కమిషనరేట్ పరిధిలోని వార్డు సచివాలయాల్లో మహిళా పోలీసుల సేవలకు ఆకాశమే హద్దు అని సీపీ శంఖబ్రతబాగ్చి అన్నారు. వారితో మంగళవారం ఆయన సమావేశం ఏర్పాటుచేశారు. కొంతమంది మహిళా పోలీస్‌లు విధి నిర్వహణపై సందేహాలు నివృత్తి చేయాలని కోరడంతో డీజీపీ కార్యాలయాన్ని సంప్రదించి జీవీఎంసీ అధికారులతో కలిసి 430 మందితో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. మహిళా పోలీసులతో కంప్యూటర్ డేటా ఎంట్రీ, ఈ-కాప్స్, సీడీఫైల్స్ రాయడం, సైబర్‌నేరాలు, మహిళలు, పిల్లలపై జరిగే నేరాలపై అవగాహన, స్టేషన్‌లో రిసెప్షన్, రికార్డులు అప్‌డేట్, కౌన్సెలింగ్, సమాచారసేకరణ, సమన్లు అందజేయడం, లోక్‌అదాలత్, ఫిర్యాదులపై తీసుకున్న చర్యలు గురించి సమాధానం ఇవ్వడం వంటి పది రకాల విధుల్లో సహాయం తీసుకోవచ్చునని గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ-1 మణికంఠచందోలు, జీవీఎంసీ యూసీడీ పీడీ సత్యవేణి, జోన్-3 కమిషనర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణంలో ఉండగానే కూలిన ఏఎస్‌ఎన్ మాల్ శ్లాబ్

» యజమాన్యానికి నోటీసు జారీచేసిన ఏపీఐఐసీ


కూలిన ఏఎస్‌ఎన్ మాల్ శ్లాబ్

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పక్కన కంచరపాలెం పోలీస్ స్టేషన్ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఏఎస్‌ఎన్ సిటీ సెంటర్‌మాల్ శ్లాబ్ రెండు రోజుల క్రితం (ఆదివారం) కూలిపోయింది. ఆ నిర్మాణానికి అనుమతులు జారీచేసిన ఏపీఐఐసీ అధికారులు స్పందించి శ్లాబ్ కూలిపోవడానికి గల కారణాలు తెలపాలని ఆదేశిస్తూ నోటీసు జారీచేశారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్‌ను ఆక్రమించి ఏఎస్‌ఎన్ మాల్ నిర్మాణం చేపట్టడంతో ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు అభ్యంతరం తెలపడంతోపాటు గ్రీన్‌బెల్ట్ ఆక్రమణపై జీవీఎంసీ అధికారులకు సైతం ఫిర్యాదు చేశారు. దీంతో జీవీఎంసీ అధికారులు స్పందించి గ్రీన్‌బెల్ట్‌లో ఆక్రమణలను తొలగించి ఫెన్సింగ్ వేయించారు. గ్రీన్‌బెల్ట్‌లో మొక్కలు నాటారు. గ్రీన్‌బెల్ట్‌లో ఇప్పటికీ కొన్ని షెడ్‌లు, ఇతర పరికరాలు ఉన్నాసరే జీవీఎంసీ అధికారులు చూసీచూడనట్టు వదిలేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ తరుణంలో నిర్మాణంలో ఉన్న ఏఎస్‌ఎన్ మాల్ రెండు రోజుల కిందట అకస్మాత్తుగా కూలిపోయింది. శ్లాబ్ కూలిపోయిన విషయమై ఏపీఐఐసీ మేనేజర్ లోహకుమార్ వద్ద ప్రస్తావించగా, తమకు సమాచారం తెలియగానే ఆ సంస్థ యాజమాన్యానికి నోటీసులు జారీచేశామని వివరించారు. వారి నుంచి సమాధానం వచ్చిన తర్వాత తదుపరి ఏం చేయాలనే దానిపై ఆలోచిస్తామన్నారు.

జీవీఎంసీ గార్బేజ్ లారీ ఢీకొని వ్యక్తి మృతి

కంచరపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అదుపు తప్పిన లారీ బస్టాప్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కంచరపాలెంలో మంగళవారం జరిగింది. తిక్కవానిపాలేనికి చెందిన షేక్ బకారి (34) ఖాళీ సీసాలు, చెత్త కాగితాలు ఏరుకుంటాడు. కంచరపాలెం బాబా ఆలయం బస్టాప్ వద్ద స్నేహితుడు రాకేష్‌తో కలిసి ఫుట్‌పాత్‌పై సోమవారం రాత్రి నిద్రించాడు. తెల్లవారుజామున తాటిచెట్లపాలెం నుంచి ఊర్వశి జంక్షన్ వైపు వెళ్తున్న జీవీఎంసీ గార్బేజ్ లారీ అదుపు తప్పి బస్టాప్‌ను ఢీకొని బకారి, రాకేష్‌పై లారీ వెళ్లిపోవడంతో బకారి అక్కడికక్కడే మృతిచెందగా, రాకేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి సీఐ దాశరథి ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

చెత్త తరలింపు వాహనాల ఇష్టారాజ్యం

- నిర్వహణ లోపంతో తరచూ రోడ్డు ప్రమాదాలు
- పట్టించుకోని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు
- తాజాగా కంచరపాలెం బస్టాప్‌లోకి దూసుకుపోయిన లారీ
- ఒకరి దుర్మరణం, మరొకరికి తీవ్ర గాయాలు



కంచరపాలెం బస్టాప్‌లోకి దూసుకుపోయిన చెత్త తరలించే హుక్‌లోడర్

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో చెత్తను కాపులుప్పాడ డంపింగ్‌యార్డుకు తరలించే వాహనాలను ఇష్టారాజ్యంగా నడుపుతున్నారు. జీతం భారం తగ్గుతుందని అనుభవం లేని డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవడం, వాహనాలకు చిన్నపాటి మరమ్మతులున్నా ఏమీకాదులే అనే నిర్లక్ష్యంతో నడుపుతుండడంతో నిత్యం ప్రమాదాలకు గురవుతున్నాయి. తాజాగా కాపులుప్పాడ డంపింగ్‌యార్డులో చెత్తను అన్‌లోడ్ చేసుకుని గాజువాకలోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్(జీటీఎస్)కు వెళుతున్న హుక్‌లోడర్ (కంటెయినర్) మంగళవారం తెల్లవారుజామున కంచరపాలెం సమీపంలో డివైడర్ పైకెక్కి బస్‌షెల్టర్‌లోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా, బస్‌షెల్టర్ ధ్వంసమైంది. తెల్లవారుజామున కావడంతో బస్‌షెల్టర్‌లో ఎవరూలేరు. అదే ఉదయం ఆరు గంటల తర్వాత జరిగితే పదుల సంఖ్యలో ప్రాణాలకు ముప్పు ఏర్పడేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్తతరలించే హుక్‌లోడర్లు రోడ్డు ప్రమాదాలకు గురికావడం, ప్రమాదాల్లో ఎవరో ఒకరు మృతిచెందడం, గాయపడడం నగరంలో నిత్యకృత్యంగా మారడం ఆందోళనకు దారితీస్తోంది. జీవీఎంసీ పరిధిలోని ఐదు జోన్లలోని చెత్తను పర్యావరణానికి ముప్పు కలిగించకుండా కాపులుప్పాడలోని డంపింగ్‌యార్డుకు తరలించేందుకు వీలుగా ఆయా జోన్లలోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల వద్ద సీసీఎస్ ప్రాజెక్టులను జీవీఎంసీ ఏర్పాటుచేసింది. వాటి నుంచి చెత్తను యంత్రాలతో కంప్రెస్‌చేసి కంటెయినర్ మాదిరిగా ఉండే హుక్‌లోడర్లతో కాపులుప్పాడ తరలించేలా జీవీఎంసీ హుక్‌లోడర్లను కొనుగోలుచేసింది. సీసీఎస్ ప్రాజెక్టుతోపాటు హుక్‌లోడర్ల నిర్వహణ బాధ్యతలను టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగించింది. ఒక్కో సీసీఎస్ ప్రాజెక్టుతోపాటు హుక్‌లోడర్ల నిర్వహణ కోసం ఏడాదికి సగటున రూ.రెండు కోట్ల వరకు కాంట్రాక్టర్లకు జీవీఎంసీ చెల్లిస్తోంది. వాహనాలకు అవసరమైన డీజిల్‌ను జీవీఎంసీయే సరఫరా చేస్తుంది. అనుభవజ్ఞుడైన డ్రైవర్‌ను నియమించుకోవడంతోపాటు వాహనాలకు మరమ్మతులు, సీసీఎస్ ప్రాజెక్టుకు సంబంధించి యంత్రాల నిర్వహణను కాంట్రాక్టర్లే చూసుకోవాలి. చెత్తను తరలించే వాహనాలు రద్దీగా ఉండే రోడ్లపై ప్రయాణించాల్సి ఉంటుంది కాబట్టి, అనుభవజ్ఞుడైన డ్రైవర్‌ను నియమించడంతోపాటు వాహనానికి చిన్నపాటి మరమ్మతు తలెత్తిన వెంటనే పరిష్కరించి, తర్వాత రోడ్డుపైకి పంపించాలి. లేదంటే వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురవుతుంది. సీసీఎస్ ప్రాజెక్టుతోపాటు వాహనాల నిర్వహణ సక్రమంగా జరిగేలా మెకానికల్ విభాగం అధికారులు పర్యవేక్షించాలి. అంతాసక్రమంగా జరిగితేనే నెల నెలా బిల్లు చెల్లింపునకు ప్రతిపాదనలు పంపించాలి. కానీ కాంట్రాక్టర్ వాహనాల నిర్వహణను గాలికి వదిలేశారు. అనుభవజ్ఞుడైన హెవీడ్రైవింగ్ లైసెన్స్ కలిగిన డ్రైవర్‌ను విధుల్లోకి తీసుకుంటే ఎక్కువ జీతం ఇవ్వాల్సి ఉంటుందని, పెద్దగా అనుభవం లేనివారిని, లైట్ వెహికల్ డ్రైవర్లను తాత్కాలిక ప్రాతిపదికన ఆప్టింగ్‌గా తీసుకుంటున్నారు. దీనివల్ల వాహనాలకు సమస్యలున్నా కాంట్రాక్టర్‌కు చెప్పడంలేదు. దీంతో వాహనాలు వేగంగా వెళుతున్న సందర్భంలో అదుపు తప్పి ప్రమాదాలకు కారణంగా మారుతున్నాయి.

నెలరోజుల కిందట గాజువాక జీటీఎస్ నుంచి చెత్తలోడుతో వెళుతున్న హుక్‌లోడర్ అక్కిరెడ్డిపాలెం వద్ద అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. మూడు నెలల కిందట ఎండాడ జంక్షన్ వద్ద రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని చెత్తవాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది వైద్యచికిత్సకు ఆర్థికసహాయం అందిస్తానని చెప్పిన కాంట్రాక్టర్ ముఖంచాటేయడంతో బాధితురాలి కుటుంబసభ్యులు జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా, ఆయన జోక్యం చేసుకుని పరిహారం ఇప్పించారు. టౌన్‌కొత్తరోడ్డు జీటీఎస్ నుంచి కాపులుప్పాడ డంపింగ్‌యార్డుకు చెత్తను తీసుకెళుతున్న వాహనం జడ్జి కోర్టు వద్ద రోడ్డు దాటుతున్న ఒక మహిళను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఏడాది కిందట ఆరిలోవ జీటీఎస్ నుంచి చెత్తను తీసుకెళుతున్న హుక్‌లోడర్ బీఆర్‌టీఎస్ రోడ్డులో అదుపుతప్పి ఆటోని ఢీకొట్టింది. ఇలాంటి ప్రమాదాలు ఏడాదిలో అనేకం జరిగినా, ఇంజనీరింగ్ అధికారులు కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవడం లేదు. వాహనాల ఫిట్‌నెస్‌ను తనిఖీ చేయడం లేదు. ఇది పరోక్షంగా ప్రమాదాలకు కారణమవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

బ్లాక్ మెయిల్ చేయడంతో చంపాను

- వివాహిత హత్యకేసులో నిందితుడి అరెస్టు



హంతకుడు శ్రీనివాసరావు(ఫైల్)

పెందుర్తి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బ్లాక్‌మెయిల్ చేసి రూ.30 లక్షలు డిమాండ్ చేయడంతో సహజీవనం చేస్తున్న మహిళను హత్య చేశారనని నిందితుడు పోలీసులకు వివరించాడు. వేపగుంట సమీప శ్రీనివాసనగర్‌లో అళ్ల దేవి (34) సహజీవనం చేస్తున్న వ్యక్తి చేతిలో ఆదివారం హత్యకు గురయింది. ఈ కేసులో పరారైన నిందితుడు వనము శ్రీనివాసరావు(42)ను మంగళవారం పెందుర్తి పోలీసులు అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. సీఐ కెవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.చినముషిడివాడకు చెందిన వనము శ్రీనివాసరావు, విజయనగరం రాజీవ్‌కాలనీకి చెందిన అళ్ల దేవి తొమ్మిది నెలలుగా సహజీవనం చేస్తున్నారు. శ్రీనివాసరావు రైస్ పుల్లింగ్ వ్యాపారంలో దేవి సహకరించేది. ఇందులో మోసం బయటపడటంతో ఆరిలోవ పోలీసులు కేసు నమోదుచేసి, శ్రీనివాసరావును జైలుకు పంపారు.దీనికి దేవి కారణమని ఆమెపై కక్ష పెంచుకున్నాడు. బెయిల్‌పై వచ్చి రెండు నెలలు క్రితం వేపగుంట సమీపంలో ఫ్లాట్ అద్దెకు తీసుకుని దేవితో కలిసి ఉంటున్నాడు. ఆదివారం దేవి వద్దకు వచ్చి శ్రీనివాసరావు, ఆమెతో ఘర్షణ పెట్టుకున్నాడు. ఇద్దరి మధ్య పెనుగులాట జరగడంతో దేవి తలపై ఇనుప కుర్చీతో బలంగా మోదడంతో పాటు కత్తితో పొడవడంతో కుప్పకూలింది.ఆ తరువాత ప్లాటుకు తాళం వేసి కారులో పరారయ్యాడు. ప్రత్యేక బృందాలతో గాలించిన పోలీసులు నిందితుడ్ని 24 గంటల్లో పట్టుకున్నారు. విచారణలో ఆసక్తికరమైన విషయాలు చెప్పాడు సహజీవనం చేస్తున్న దేవిని పెళ్లి చేసుకోవాలని భావించి తన భార్యను విడాకుల కోసం బలవంతం చేశానన్నాడు. దేవి అందం మెరుగులు దిద్దేందుకు రూ.3 లక్షలు, ఐఫోన్, 27 లక్షలతో స్థలం కొన్నానన్నాడు. అయినా రూ.30 లక్షలు కావాలని బెదిరించేదని, రైస్ పుల్లింగ్ మోసం కేసులో జైలుకి వెళ్లడానికి ఆమె కారణమని తెలిసి చంపేద్దామని నిర్ణయించుకున్నానన్నాడు.



బీసీ హాస్టల్‌లో పాస్టర్ల మత ప్రచారం

- ఇన్‌చార్జి మేట్రిన్ నిర్వాకం
- తప్పు కాదని స్థానికులతో వాగ్వాదం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు, టీడీపీ నాయకులు



తగరపువలస బీసీ హాస్టల్‌లో మత ప్రచారం చేస్తున్న పాస్టర్లు

తగరపువలస, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బీసీ బాలుర సంక్షేమ వసతిగృహంలో ఇద్దరు పాస్టర్లు మతప్రచారం చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డు టీడీపీ అధ్యక్షుడు టి.సూరిబాబు, పి.నానిబాబు తదితరులు హాస్టల్‌కు చేరుకుని పాస్టర్లను నిలదీశారు. స్థానికులు పోలీసులకు పిర్యాదు చేశారు. హాస్టల్ మేట్రిన్ సునీత మెటర్నిటీ సెలవులో ఉన్నారు. ఇన్‌చార్జిగా ప్రసాద్‌ను నియమించారు. ఎస్సీ హాస్టల్ మేట్రిన్, విజయనగరం జిల్లా భోగాపురం మండలానికి చెందిన ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు మంగళవారం పాఠశాల నుంచి విద్యార్థులను బీసీ హాస్టల్‌కు రప్పించి విశాఖ నుంచి వచ్చిన ఇద్దరు పాస్టర్లతో క్రీస్తు బోధన చేస్తున్నారు. పాఠశాల నుంచి ఆలస్యంగా వచ్చిన కొంతమంది విద్యార్థులు హాస్టల్‌లో కూటమి నిర్వహిస్తున్న విషయాన్ని స్థానిక నాయకులకు తెలిపారు. దీంతో వారంతా అక్కడికి చేరుకుని ప్రభుత్వ హాస్టల్‌లో మత ప్రచారం చేయడంపై నిలదీశారు. కాగా జిల్లాలోని చాలా హాస్టళ్లలో ఇలా జరుగుతోందని, తప్పేమీ కాదని ఇన్‌చార్జి వార్డెన్ ప్రసాద్ వారితో వాగ్వాదానికి దిగాడు. స్థానికులు గట్టిగా నిలదీయడంతో విశాఖ నుంచి పాస్టర్లు పారిపోయారు. ఇక్కడ ఇన్‌చార్జి మేట్రిన్‌గా పనిచేస్తున్న ప్రసాద్ నిత్యం మత ప్రచారం చేస్తుంటాడని, విద్యార్థులను బలవంతంగా మత మార్పిడికి యత్నిస్తున్నాడనే విమర్శలున్నాయి. సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హాస్టల్‌లో జరిగిన మత ప్రచారంపై ఫొటోలు, వీడియోలు తీశామని, విషయాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్తామని టీడీపీ నేత డి.వెంకటేష్ తెలిపారు.

కడుపునొప్పి తాళలేక వృద్ధుడి ఆత్మహత్య

కంచరపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక ఓ వ్యక్తి ఉరివేసుకుని మృతిచెందాడు. రెడ్డికంచరపాలెం రామాలయం సమీపంలో ఉంటున్న గుజ్జి కాశీవిశ్వేశ్వరరెడ్డి(61) కూలీ. కొంత కాలంగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నాడు. రెండు రోజులుగా మితిమీరిన మద్యం సేవించేవాడు. ఈ క్రమంలో మంగళవారం తీవ్రమైన కడుపునొప్పి రావడంతో తట్టుకోలేక ఇంట్లోని సీలింగ్‌ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నాడు. అతడి భార్య శ్రీదేవి డాబాగార్డెన్స్‌లోని బుక్‌షాప్‌లో పనిచేస్తోంది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదుచేశారు.